Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 362 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 జనవరి 2024 ఆదివారం పేజీలు : 4

### తరలిరానున్న భిన్న రంగాల దిగ్గజాలు

అయోధ్య : రామాలయ ప్రతిష్ఠకు దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలకు, సినీ ప్రముఖులకు, రాజకీయ నేతలకు, ఉన్నతాధికారులకు, దౌత్యాధికారులకు... మొత్తం సుమారుగా 8వేల మందికి ఆహ్వానాలు అందాయి. వారిలో అత్యంత ప్రముఖులు సుమారు 100మంది దాకా ఉన్నారు. దేవాలయ ప్రతిష్ఠకు ప్రముఖ నటుడు అమితాబచ్చన్ ప్రత్యేక విమానంలో తరలిరానున్నారు. ఆహ్వానం అందుకున్న సినీ ప్రముఖుల్లో అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, చిరంజీవి, అల్లు అర్జున్, మోహన్ లాల్, అనుపమ్ ఖేర్ తదితరులు ఉన్నారు. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్‌పర్సన్ కుమార మంగళం బిర్లా, పిరమల్ గ్రూప్ చైర్‌పర్సన్ అజయ్ పిరమల్, ఆనంద్ మహీంద్ర తదితరులు ఉన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక

## రామయ్యకు పొరుగు దేశం నుంచి అభిషేక జలం

## కశ్మీర్ నుంచి కుంకుమ పువ్వు




అయోధ్యలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రామ మందిరం ప్రారంభోత్సవానికి అంతా సిద్ధమవుతోంది. ఈ నెల 22న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రామ మందిరం ప్రారంభోత్సవం జరగనుంది. అదే రోజు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం కూడా జరగనుంది. ఈ అద్భుత ఘట్టం కోసం దేశం మొత్తం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

అయితే రామాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో దేశంలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి రామ భక్తులు భారీ ఎత్తున కానుకలు పంపిస్తున్నారు. కశ్మీర్, తమిళనాడు, అఫ్ఘానిస్థాన్ నుంచి రామ మందిరానికి కానుకలు వచ్చాయి. కశ్మీర్‌లోని ముస్లిం సోదరులు, సోదరీమణులు అయోధ్య రామయ్యకు 2 కిలోల సేంద్రీయ కుంకుమ పువ్వును అందజేశారు. కశ్మీర్, తమిళనాడు, అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చిన కానుకలను విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అలోక్ కుమార్ అందుకున్నారు. సదరు కానుకలను ఆయన శ్రీరామ దేవాలయం 'యజ్మాన్' అనిల్ మిశ్రాకు అందజేశారు. అలోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కశ్మీర్‌కు చెందిన ముస్లిం సోదరసోదరీమణులు సేంద్రీయ పద్ధతిలో పండించిన 2 కిలోల స్వచ్ఛమైన కుంకుమ పువ్వును రామయ్యకు కానుకగా ఇచ్చారు. తమిళనాడుకు చెందిన పట్టు తయారీదారులు శ్రీరాముని ఆలయాన్ని చిత్రీకరించే సిల్క్ బెడ్‌షీట్ రామయ్య కోసం పంపారు. పొరుగు దేశం అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లో ప్రవహించే కుభా(కాబూల్) నది జలాన్ని శ్రీ రాముడి అభిషేకం కోసం పంపించారు. అలాగే కనౌజ్ నుంచి వివిధ రకాల అత్తరులు, అమరావతి నుంచి 500 కిలోల కుంకుమ, ఢిల్లీ నుంచి రామాలయాల్లో సేకరించిన ధాన్యం అయోధ్యకు చేరుకున్నాయి.

ఇవేకాకుండా 108 అడుగుల అగరుబత్తీ, 2,100 కిలోల గంట, 1,100 కిలోల భారీ దీపం, బంగారు పాదుకలు, పది అడుగుల తాళం, ఏకకాలంలో 8దేశాల సమయాన్ని సూచించే గడియారం ట్రస్టుకు అందాయి. సీతమ్మ జన్మస్థలం నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి వెండి పాదరక్షలు, ఆభరణాలు, వస్త్రాలతో పాటు 3వేలకు పైగా బహుమతులు కాన్వాయ్‌గా వచ్చాయి. శ్రీలంక ప్రతినిధి బృందం అశోకవాటిక నుంచి ప్రత్యేక కానుక తీసుకొచ్చింది. ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయం నుంచి 5లక్షల లడ్డూలతో కూడిన ట్రక్ శుక్రవారం అయోధ్యకు బయల్దేరింది. మధురలోని శ్రీకృష్ణ జన్మస్థాన్ నుంచి 200 కిలోల లడ్డూలు, తిరుమల శ్రీవారి ఆలయం నుంచి లక్ష లడ్డూలు పంపారు. భక్తుల కోసం 7వేల కిలోల రామ్ హల్వాను తయారు చేయనున్నట్లు నాగపూర్‌కు చెందిన చెఫ్ విష్ణు మనోహర్ ప్రకటించారు. రాముడికి బంగారు పూతపూసిన పాదరక్షలను సమర్పించడానికి హైదరాబాద్‌కు చెందిన 64ఏళ్ల చల్లా శ్రీనివాస శాస్త్రి 8వేల కిలోమీటర్లు నడిచి అయోధ్యకు చేరుకున్నారు.

## తెలంగాణ లోక్‌సభ కోసం బీజేపీ గేమ్ స్టార్ట్

### కొత్త నేతను దింపిన హైకమాండ్



హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల గడువు సమీపించింది. ఇంకో రెండు నెలల్లో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ ఎన్నికలను ఎదుర్కొనడానికి ముమ్మర కసరత్తు సాగిస్తోన్నాయి. గెలుపు గుర్రాల వేటలో పడ్డాయి. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. అత్యధికం బీఆర్ఎస్ ఖాతాలో ఉన్నాయి. తొమ్మిది స్థానాల్లో గులాబీ జెండా ఎగురుతోంది. నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. మరో మూడింటిని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఏఐఎంఐఎం ఒక స్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది బీజేపీ. 17 లోక్‌సభ నియోజకవర్గాలకూ రాజకీయ ఇన్‌ఛార్జీలను ప్రకటించింది. శాసన సభ, శాసన మండలి సభ్యులకు ఈ బాధ్యతలను అప్పగించింది. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పార్టీ స్థితిగతులపై అధ్యయనం చేయడం, సమర్థుడైన అభ్యర్థి పేరును వాళ్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చవి చూసిన బీజేపీకి చెందిన కొందరు సీనియర్ నేతలు లోక్‌సభ బరిలో నిల్చోవడం ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డి- తనకు అచ్చి వచ్చిన సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మరోసారి ఎన్నికల్లో పోటీ చేయబోతోన్నారు. ప్రస్తుతం ఆయన ఇదే నియోజకవర్గానికి ప్రాతినిథ్యాన్ని వహిస్తోన్నారు. ఈ పరిస్థితుల్లో ఓ కొత్త నాయకుడిని రంగంలోకి దించిన బీజేపీ జాతీయ నాయకత్వం. రాజస్థాన్‌కు చెందిన సీనియర్ నేత చంద్రశేఖర్‌ను తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. గత ఏడాది రాజస్థాన్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం వెనుక చంద్రశేఖర్ కీలక పాత్రను పోషించారు. అభ్యర్థుల ఎంపిక మొదలుకుని, ప్రచార కార్యక్రమాల వరకూ అన్నింటినీ చంద్రశేఖరే పర్యవేక్షించారు. వ్యూహాత్మంగా వ్యవహరించగలిగారు. అందుకే ఆయనను తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి అత్యధిక స్థానాలను గెలిపించే బాధ్యతను ఇచ్చింది బీజేపీ హైకమాండ్. తెలంగాణలో రాజస్థానీయుల ఓటుబ్యాంక్ అధిక సంఖ్యలో ఉండటం కూడా- ఆయన నియామకానికి ఓ కారణమైంది. చంద్రశేఖర్‌ను పార్టీ తెలంగాణ రాష్ట్రశాఖ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజింగ్)గా నియమిస్తూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఓ ప్రకటన జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు.

## రియల్ ఎస్టేట్‌లో తెలంగాణ టాప్..



### ఏపీ పరిస్థితి ఎలా ఉందంటే!

హైదరాబాద్ : ఏ రాష్ట్రంలో అయినా.. అభివృద్ధికి కేరాఫ్... రియల్ ఎస్టేట్ రంగమే. ఈ విషయంలో ఎలాంటి తేడా లేదు. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటే.. అనేక అనుబంధ రంగాలద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. అందుకే.. ఈ రంగాన్ని ఆర్థిక వ్యవస్థలోనూ కీలకమైన రంగంగా పేర్కొంటారు. ఈ రియల్ ఎస్టేట్ రంగంలో రెండు తెలుగు రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉందంటే.. తెలంగాణ దూసుకుపోతోంది. అదేసమయంలో ఏపీ నెమ్మది నెమ్మదిగా అడుగులు వేస్తోంది. ఇది ఎవరో ఉద్దేశ పూర్వకంగాచేస్తున్న విమర్శలు కావు.. రాజకీయం అంతకన్నా కాదు. అధికారికంగా.. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) చెబుతున్న లెక్కలే ఈ విషయాన్ని ధ్రుధ పరుస్తున్నాయి.

గత రెండేళ్లుగా .. ఇరు రాష్ట్రాల్లోనూ అమలవుతున్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు సంబంధించి రెరాలో నమోదైన వివరాలను గమనిస్తే.. తెలంగాణలో రియల్ రంగం దూకుడుగా ఉందని తెలుస్తోంది. తెలంగాణలో గత రెండేళ్లుగా 8,227 ప్రాజెక్టుల రెరాలో నమోదయ్యాయి. ఇదేసమయంలో ఏపీలో నమోదైన ప్రాజెక్టుల సంఖ్య కేవలం 3900. అంటే.. సగానికిపైగానే తేడా ఉంది. పైగా.. ఏపీలో రాజధాని లేకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారింది. తెలంగాణ రాజధాని నగరం హైదరాబాద్‌ను విస్తరిస్తున్నారు. చుట్టుపక్కల అంతా.. దాదాపు రియల్ రంగం పుంజుకునే వాతావరణం ఏర్పడింది. ఐటీ రాక, పారిశ్రామిక జిలుగులు కూడా రియల్ ఎస్టేట్ రంగానికి బూస్ట్ ఇచ్చాయనే చెప్పాలి. ఇక, కొనుగోలు దారుల భద్రతకు తెలంగాణ రెరా అధికారులు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటోంది.

రెరాలో నమోదైన ప్రాజెక్టులకు వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వేగంగా పనులు చేపట్టి.. వినియోగదారులకు అందించేందుకు కూడా తోడ్పడుతున్నట్టు తెలంగాణ అధికారులు చెబుతున్నారు. ఇక, ఏపీ విషయానికి వస్తే.. రాజధాని లేకపోవడం.. ప్రభుత్వం నుంచి రియల్ రంగానికి ప్రోత్సాహం కనిపించకపోవడంతో ఈ రంగం సగానికి సగం చతికిలపడింది.

# పెట్టుబడుల వరద...

## సీఎం రేవంత్ ఫస్ట్ సక్సెస్

## దావోస్‌లో అత్యంత ఆకర్షణగా నిలిచిన రేవంత్‌రెడ్డి




దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొని పలు ప్రతిష్టాత్మక కంపెనీల పెద్దలతో చర్చలు జరుపుతూ బిజీగా ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... తాజాగా కీలక ఒప్పందాలు కుదిర్చారు. ఇందులో భాగంగా... తెలంగాణలో డేటా సెంటర్లను నెలకొల్పేందుకు వెబ్ వెర్క్స్ భారీ పెట్టుబడులకు సిద్ధపడింది. ఈ సందర్భంగా వెబ్ వెర్క్స్ ప్రతినిధులు కీలక విషయాలు వెల్లడించారు. అవును... దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో బిజీగా ఉన్న రేవంత్ రెడ్డి తెలంగాణలో డేటా సెంటర్ల ఏర్పాటు, నిర్వహణపై పలు సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఇందులో భాగంగా... డేటా సెంటర్ల నిర్వహణలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఐరన్ మౌంటెన్ అనుబంధ సంస్థ వెబ్ వెర్క్స్ తో ఒప్పందం కుదిర్చారు. దీంతో తెలంగాణలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ సిద్ధమైందని తెలుస్తుంది. ఇందులో భాగంగా... దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి.. ఐరన్ మౌంటేన్ సీఈవో విలియం మీనీ, వెబ్ వెర్క్స్ సీఈవో నిఖిల్ రాఠీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. తెలంగాణలో డేటా సెంటర్ల ఏర్పాటు, నిర్వహణపై చర్చలు జరిపారు. దీంతో... రూ.5200 పెట్టుబడులకు వెబ్ వెర్క్స్ కంపెనీ తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. వాస్తవానికి హైదరాబాద్ లో 10 మెగావాట్ల నెట్ వర్కింగ్ హెవీ డేటా సెంటర్ లో ఇప్పటికే ఈ కంపెనీ రూ.1,200 కోట్లు పెట్టుబడి పెడుతోండగా... దీనికి అదనంగా మరో రూ. 4,000 కోట్లకు పైగా పెట్టుబడులతో గ్రీన్ ఫీల్డ్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ విస్తరించేందుకు ఈ ఒప్పందం చేసుకుంది. ఈ నిర్ణయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఈ సందర్భంగా... దేశంలోనే డేటా సెంటర్ల ఏర్పాటుకు తెలంగాణ అసలైన గమ్యస్థానంగా నిలుస్తుందని.. పెట్టుబడిదారులు అందుకు అవసరమైన విద్యుత్తును కూడా పునరుత్పాదక వనరుల ద్వారా సమకూర్చుకుంటున్నారని తెలిపారు. ఇదంతా తమ కొత్త ప్రభుత్వం అనుసరించే ఫ్రెండ్లీ పాలసీపై వాళ్లకున్న నమ్మకాన్ని చాటి చెపుతోందని వెల్లడించారు. ఇదే సమయంలో స్పందించిన ఐరన్ మౌంటైన్ సీఈవో... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయటం ఆనందంగా ఉందని అన్నారు. ఇందులో భాగంగా... ప్రపంచవ్యాప్తంగా తమ డేటా సెంటర్ లలో నూరుశాతం పునరుత్పాదక శక్తిని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధనం రెండింటికి మద్దతు అందించటం ద్వారా పెట్టుబడులను ఆకర్షణీయంగా మార్చిందని తెలిపారు.

# సంపాదకీయం

## దేశంలో పేదలు లేని రాష్ట్రం ఇదే... తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి..?

దేశానికి స్వాతంత్రం వచ్చి ఇన్ని దశాబ్దాలు అవుతున్నా.. పేదలు పేదలుగానే ఉన్నారు, ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారనే కామెంట్లు నిత్యం వినిపిస్తూనే ఉంటాయి. రాజకీయ పార్టీలు కూడా స్వాతంత్ర భారతదేశంలో జరిగిన తొలి ఎన్నికల నుంచి నేటి వరకూ పేదరిక నిర్మూళనే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెబుతుంటారు! ప్రతీ ఎన్నికల్లోనూ చెప్పడానికో ఏమో కానీ... వారి సంఖ్యను అలానే కంటిన్యూ చేస్తున్నారనే మాటలు వినిపిస్తుంటాయి! ఈ క్రమంలో స్వాతంత్రం వచ్చిన ఇంతకాలం తర్వాత అతి తక్కువగా, అంటే ఆల్ మోస్ట్ అరశాతం కంటే తక్కువమంది పేదలు కలిగిన రాష్ట్రం తెరపైకి వచ్చింది. తాజాగా నీతి ఆయోగ్ వెల్లడించిన న్నివేదిక ప్రకారం ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. సగటు భారతీయుడు గర్వించదగ్గ విషయంగా దీన్ని చెబుతున్నా.. దేశంలోని మిగతా రాష్ట్రాల పరిస్థితి ఆ అనందం లేకుండా చేస్తుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా... మొదలైందని మాత్రం చెప్పుకోవచ్చు. అవును... గాడ్స్ ఓన్ కంట్రీగా చెప్పుకునే కేరళ రాష్ట్రం దేశంలోనే అతి తక్కువ పేదరికం ఉన్న రాష్ట్రంగా నిలిచింది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2005-06లో కేరళ జనాభాలో 12.31 శాతం మంది పేదలు ఉండగా.. తాజాగా 2022-23లో కేరళ జనాభాలో పేదరికం 0.48 శాతానికి తగ్గింది. అంటే... ప్రస్తుతం కేరళ జనాభాలో కేవలం అరశాతం కంటే తక్కువ మంది పేద ప్రజలు ఉన్నారన్నమాట. ఇక దేశంలో పేదలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో బీహార్ మొదటి స్థానంలో ఉంది. ప్రస్తుతం బీహార్ లో 26.59 శాతం పేదరికం ఉంది. ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే... ఆంధ్రప్రదేశ్ లో 4.19 శాతం పేదలు ఉండగా.. తెలంగాణలో మూడు శాతం మంది ఉన్నారు. వాస్తవానికి రెండు దశాబ్ధాల క్రితంతో పోలిస్తే ఇప్పుడు పేదరికం చాలా వరకూ తగ్గిందనే చెప్పాలి. ఇందులో భాగంగా... 2005-06లో దేశంలో పేదరికం 55.34 శాతం ఉండగా... అది 2022 -23 నాటికి 11.28 శాతానికి తగ్గింది. వాస్తవానికి పోషకాహార లభ్యతతో పాటు ప్రధానంగా శిశు మరణాల రేటు, విద్య, విద్యుత్తు, పారిశుధ్యం, ఇళ్లు, వంట ఇంధనం, బ్యాంకు ఖాతా వంటి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని పేదరిక స్థాయిని లెక్కించారు. కాగా ఈ పారామీటర్స్ పైనా వివాదాలు ఉన్న సంగతి తెలిసిందే.

# ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు....

### కూకట్పల్లి జేఎన్టీయూలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ హాజరు కానుండడంతో... ముందస్తుగా ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల జాయింట్ సి ఈ ఓ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ గౌతమ్...





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25న మేడ్చల్ %-- % మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్పల్లి జేఎన్టీయూలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరు కానున్నరు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సి ఇ ఓ సర్ఫరాజ్ అహ్మద్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కమిషనర్ రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు, వసతులను పరిశీలించారు. జేఎన్టీయూ కాలేజీ ఆడిటోరియంలో ఈ నెల 25 న జరిగే గవర్నర్ కార్యక్రమానికి సంబంధించి పూర్తి ఏర్పాట్లను పరిశీలించినారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించే సమయంలో సభావేదికతో పాటు పాల్గొనే వీఐపీలు కోసం, వసతులను పరిశీలించారు. అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కూకట్పల్లిలోని జేఎన్టీయూలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రానున్నారని తెలిపారు. జిల్లా పరిధిలోని జేఎన్టీయూలో జరిగే కార్యక్రమానికి గవర్నర్ హాజరు కానున్ననేపథ్యంలో ఇప్పటి నుంచే అవసరమైన అన్ని ఏర్పాట్లుపూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి వచ్చే వారికి సంబంధించి పార్కింగ్ తదితర వివరాల విషయమై పోలీసులకు అవసరమైన సూచనలను కలెక్టర్ గౌతమ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్, ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్, పోలీసు అధికారులు, జేఎన్టీయూ అధికారులు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# మెరుగైన సేవలు అందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలి

### ఉత్తమ పోలీసులకు సేవా పతకాలు అందజేసిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్







సైబరాబాద్ క్రైమ్ (గరుడ వార్త) : విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఉత్తమ సేవా పథకాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ ప్రధానం చేశారు. సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో బహుమతి ప్రధాన కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... సేవా పతకాలను అందుకున్న వారిని అభినందించారు. ప్రజా రక్షణ, విధి నిర్వహణలో అసామాన్యమైన ప్రతిభను కనబరిచిన పోలీస్ సిబ్బందికి గుర్తింపునిచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేవా పతకాలను ఇస్తాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు, కొత్త సంవత్సరంలో ఈ పతకాలను అందజేస్తుందన్నారు. 2023 సంవత్సరానికి గాను సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలో 138 మంది పోలీసు సిబ్బందికి పతకాలు అందచేశామన్నారు. ఇందులో, 58 ఉత్కృష్ట, 80 సేవా పతకాలు అందచేశామన్నారు. వీరిలో కానిస్టేబుల్ నుంచి ఏడీసీపీ ర్యాంక్ వరకూ ఉన్నారన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహించడం, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎటువంటి రిమార్కులు లేకుండా పతకాలు స్వీకరించడం ఆనందదాయకమని, ఇదే స్ఫూర్తితో విధుల పట్ల అంకితభావం, మంచి ప్రతిభ కనబరిచి, ప్రజలకు పోలీసు వారి సేవలను అందించాలని, అదేవిధంగా పోలీసు శాఖకు మంచి పేరు ప్రతిష్టలు వచ్చేలా విధులు నిర్వహించాలని సీపీ గారు తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా బాగా పనిచేసి ప్రజలకు మెరుగైనా సేవలు అందించి ప్రభుత్వము నుంచి మరిన్ని పతకాలు సాధించాలన్నారు. అలాగే ఇతర సిబ్బంది కూడా పతకాలను అందుకున్న వారిని స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా పతకాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్ నాయక్, ఐపీఎస్., మాట్లాడుతూ.. సేవా పతకాలను అందుకున్న వారికి అభినందనలు తెలిపారు. సేవా పతకాలను అందుకోవడం వల్ల సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపడంతో పాటు తోటి వారికి ఆదర్శంగా తీసుకుంటారన్నారు. అలాగే ఇతర సిబ్బంది కూడా పతకాలను అందుకున్న వారిని స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా పతకాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. అవార్డు అందుకున్న వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ సభ్యుల సహకారం లేనిది విధుల్లో ఉత్తమ పనితీరు కనబర్చడం సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ సీపీ నారాయణ్ నాయక్, ఐపీఎస్., డీసీపీ అడ్మిన్ రవి చందన్ రెడ్డి, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఏసీపీలు, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, సెక్షన్ల సిబ్బంది, మరియు మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉపాధ్యాయుల కృతజ్ఞత సభ

హైదరాబాద్: జీవో నెంబర్ 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి వారి సొంత జిల్లాలకు పంపిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం సంతోషంగా ఉందని జీవో నెంబర్ 317 బాధిత అధ్యక్ష కార్యదర్శులు విజయకుమార్, దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయుల సమస్యపై హామీ ఇచ్చినందుకు నేడు ఆదివారం ఖైరతాబాద్ లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్లో అభినందన కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ప్రొఫెసర్ కోదం డరాం, మల్లు రవి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, పాలిటెక్నిక్ అధ్యక్షులు సందీప్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభకు తెలంగాణలోని అన్ని జిల్లాల ఉపాధ్యాయులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో వారు పేర్కొన్నారు.

# అయోధ్య రామయ్య ప్రతిష్ఠ మహోత్సవానికి విద్యుత్ దీపాలంకరణలో అలరారుతున్న ఆలయాలు

శామీర్ పేట, ( గరుడ వార్త) : అయోధ్య రామయ్య ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా వివిధ గ్రామాల లో ఆలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. శామీర్ పేట మండలం, తూముకుంట మున్సిపల్,



మూడు చింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో ఆలయాలను సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం జరిగే రామయ్య ప్రతిష్ట మహోత్సవానికి ఏర్పాట్లను నిర్వాహకులు సిద్ధం చేసుకుంటున్నారు. ఆయా గ్రామాలలో రామయ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి తమ తమ ఇళ్ళను శుద్ధి చేసుకుని పలు ఏర్పాట్లను చేసుకుంటున్నారు.

# మంత్రి సీతక్కని కలిసిన ఎంప్లాయ్మెంట్ ట్రైనింగ్ రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్ సురేందర్ నాయక్

శామీర్ పేట, (గరుడ వార్త) : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ రాష్ట్ర అధ్యక్షుడు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించాడు. శనివారం నగరంలో మంత్రి సీతక్కను ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్ సురేందర్ నాయక్ కలిసి కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను, ఉద్యోగుల బాధలను విన్నవించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని మంత్రి దృష్టికి



తీసుకువెళ్లాడు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పై ఆరా తీయాలని అధికారులకు ఆదేశాలను జారీ చేశారని తెలిపారు. త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. తెలంగాణ సెంట్రల్ యూనియన్ ఫోరం గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ భరత్ అండదండలు, ఆశీస్సులతో ముందుకు వెళ్లి సమస్యలను పరిష్కరించుకుంటామని రాథోడ్ సురేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి అరుణ్, ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రజక సోదరులకు అన్నింటా అండగా ఉంటాం...

### మంత్రి పొన్నం ప్రభాకర్

శామీర్ పేట, ( గరుడ వార్త) : రజక సోదరులకు అన్నింట తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చినట్లుగా రజక సంఘం నాయకులు తెలిపారు. బీసీ వెల్ఫేర్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను రజక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సెక్రటేరియట్ తన ఛాంబర్ లో తెలంగాణ రజక సంఘాల చైర్మన్ బస్వరాజు శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. రజకులకు ప్రభుత్వం నుంచి రావలసిన



ప్రతి దానిలో నా సహకారం ఉంటుందని మంత్రి తెలిపినట్లు చెప్పారు. అలాగే పెండింగ్ లో ఉన్న కరెంటు బిల్లులకు ప్రభుత్వం చే నిధులు విడుదల చేసినందుకుతెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బర్లపాటి జయరాం మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో సంపత్,పెద్దాపురం కుమారస్వామి, దుబ్బాక రమేష్, కోట్ల శ్రీనివాస్,రాములు, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు తేట.. లెక్కల్లో బాసట

కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు కన్పించడంలేదు. తెలుగు రాయడం, చదవడం రాదు.. కీలక అంశమైన గణితంలోనూ వెనుకబాటు. ఈ రెండు అంశాల్లో విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులు నిర్ణయించుకున్నారు. వినూత్న బోధన పద్ధతికి శ్రీకారం చుట్టి సత్ఫలితాలు సాధించి రాష్ట్ర విద్యాశాఖ దృష్టిని ఆకర్షించారు. ఇదే విధానం ఈ విద్యాసంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళిక చేపట్టారు. ఇదీ పెనుబల్లి మండలం వీఎం బంజర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఘనత..

ప్రత్యేక ప్రణాళిక : జీవశాస్త్రం ఉపాధ్యాయుడికి బీఈడీ శిక్షణలో తెలుగు పాఠ్యాంశం ఉంటుంది. అలాగే భౌతిక శాస్త్రం మెథడాలజీలో గణితం ఉంటుంది. సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో పాటు ఆయా ఉపాధ్యాయులను కూడా ప్రత్యేక తరగతులకు కేటాయిస్తున్నారు. ఇలా అన్ని సెక్షన్లలో ఉపాధ్యాయులు ఉండేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మెరుగైన ఫలితాలు సాధిస్తూ జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లారు.

అధికారుల ప్రశంసలు

ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ న్యూమెరసీ మిషన్) ప్రవేశపెట్టింది. 6 నుంచి 9 తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఎలాంటి పద్ధతులను ప్రవేశపెట్టాలి? ఎవరైనా అనుభవం ఉంటే చెప్పాలని ఎస్సీఆర్టీ(స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్) ప్రకటనను జిల్లా విద్యాశాఖధికారి వాట్సప్ గ్రూప్‌లో పెట్టారు. పాఠశాల హెచ్‌ఎం బండి నరసింహారావు తాము అవలంబిస్తున్న బోధన పద్ధతులు, పాఠశాలలో ఎన్నికల నిర్వహణ, వచ్చిన ఫలితాలను ఆ గ్రూప్‌లో



పోస్టు చేశారు. ఇందుకోసం ఉపాధ్యాయ సిబ్బంది 23 మంది, ఎన్నికైన విద్యార్థులు 27 మందితో బృందంగా ఏర్పడినట్టు వివరించారు. ఎన్సీఆర్టీ ఏర్పాటు చేసిన అఖిల భారత కార్యశాలకు 9 రాష్ట్రాల్లో 35 మంది హెచ్‌ఎంలను ఎంపిక చేశారు. వారిలో ఉన్న వీఎం బంజర్ పాఠశాల హెచ్‌ఎం మూడు రోజుల పాటు ఆన్‌లైన్లో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ విషయం రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లగా ఆయనను పిలిపించి మాట్లాడారు. వీఎం బంజర్ ఉన్నత పాఠశాలలో అనుసరిస్తున్న పద్ధతిని రాష్ట్రవ్యాప్తంగా అమలుకు కసరత్తు చేస్తోంది.

వీఎం బంజర పాఠశాలలో వినూత్న బోధన తీరు

ప్రధానోపాధ్యాయుడు బండి నరసింహారావు సారథ్యంలో పాఠశాల ఉపాధ్యాయులు అందరు కలసి విద్యార్థుల కనీస సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులను వారి వారి సామర్థ్యాలను కొలమానంగా తీసుకొని పది సెక్షన్లుగా విభజించారు. ఆయా అంశాల్లో వెనుకబాటు, ప్రగతిని బట్టి తరగతులతో సంబంధం లేకుండా ఆయా సెక్షన్లు కేటాయించారు. వారికి సాయంత్రం 7, 8 పీరియడ్లలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. అందులో అక్షరాల నుంచీ నేర్పిస్తారు. ఇలా గత విద్యాసంవత్సరం ఏమీ రాని విద్యార్థుల్లో తెలుగు పాఠ్యాంశంలో 60 శాతం పురోగతి సాధించగా, గణితంలో 33 శాతం ప్రగతి సాధించారు. మా పాఠశాల చదువుతున్న విద్యార్థులు అన్ని సామర్థ్యాలు పొందిన తర్వాతే బయటకు వెళ్లేలా నూతన బోధన పద్ధతులకు ప్రణాళికలు రూపొందించాం. రాష్ట్ర విద్యాశాఖధికారుల ప్రశంసలు పొందుతున్నాం. వీటిలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనది. ఈ ఏడాది రెండో దశకు వెళ్తున్నాం. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాం. బండి నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు, వీఎం బంజర్, పెనుబల్లి

# సాగు.. సందిగ్ధం

కొత్తగూడెం : వానాకాలం తొలి నాళ్లలోనే రైతులకు నిరాశ తప్పడం లేదు. మధ్యతరహాకు చెందిన వైరా జలాశయం ఆయకట్టులో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా సింహభాగం వరి సాగు చేస్తుంటారు. వానాకాలం సాగుకు సంబంధించి ఇంతవరకు స్పష్టత లేదు. జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం పడిపోతుంది. జలాశయం పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 18.3 అడుగులు కాగా మంగళవారం నాటికి 14.11 అడుగులకు చేరింది. 14.3 అడుగుల నీటిమట్టం వరకు మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా నిల్వ ఉంచాలనే నిబంధన ఉంది. ఇప్పటివరకు ఉన్న నీటిమట్టం కేవలం తాగునీటి అవసరాలకే సరిపోతుంది. వానాకాలం సాగును ముందుకు తీసుకురావాలనే అంశంపై ఇటీవల వ్యవసాయ శాఖ చేసినప్పటికీ ప్రకృతి కరుణించకపోవటం ప్రతికూలంగా మారింది.



మరోవైపు మరమ్మతులు

జలాశయం కుడి, ఎడమ కాలువ హెడ్‌స్లూయిస్‌లను మార్చే పనులు కొద్దిరోజులుగా జరుగుతున్నాయి. వీటి నిర్వహణకు రూ.40 లక్షలు మంజూరవగా పనులు పూర్తి చేసేందుకు మరో 20 రోజుల వరకు పట్టే వీలుంది. ఒకవేళ వరుణుడు కరుణించినా ఇప్పటికప్పుడు నార్లు పోసుకునేందుకు నీటిని విడుదల సైతం చేసే వీలులేదు. హెడ్‌స్లూయిస్ పనులు పూర్తయ్యేందుకు జులై మొదటి రెండో వారం వరకు ఆగాల్సి వస్తుందని అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాల్వల వద్ద రింగుబండ్ పనులు జరుగుతున్నాయి. దీనివల్ల హెడ్‌స్లూయిస్ వరకు నీటిని రాకుండా ఆపుతున్నారు. ప్రస్తుతం కొత్త లాకులు తెప్పించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

# పరిశోధనలకు సాన.. విత్తనోత్పత్తి భళా..!



మధిర : ఒక కొత్త వంగడాన్ని రూపొందించి విడుదల చేయటానికి 15 ఏళ్ల పాటు శాస్త్రవేత్తలు శ్రమించాలి. అలాంటి వంగడాలనెన్నో సృష్టించిన ఘనత మధిర వ్యవసాయ పరిశోధన స్థానానికి దక్కింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు సాగిస్తూ.. కొత్త వంగడాలు సృష్టిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోంది. తొలినాళ్లలో పొగాకుకు పరిమితమైన పరిశోధనలు తరువాత జొన్న, అపరాలకు విస్తరించాయి. పదేళ్లుగా అధిక విత్తనోత్పత్తి సాధిస్తూ మధిర వ్యవసాయ పరిశోధన స్థానం తెలంగాణ రాష్ట్రానికి వరప్రదాయినిగా మారింది. 1945లో 17.26 హెక్టార్ల విస్తీర్ణంలో పరిశోధన స్థానం ఏర్పాటైంది. 1960 వరకు పొగాకుపై పరిశోధనలు జరిగాయి. 1960-61లో మాగీ జొన్నపై పరిశోధించారు. ఈ రకాన్ని రైతులు ఆగస్టులో విత్తుకుంటారు. 1971 నుంచి అపరాలు ఎంఆర్‌జీ (మధిర కంది రకం), ఎంజీజీ (మధిర పెసర రకం), ఎంబీజీ (మధిర మినుము రకం) మీద పరిశోధనలు జరుగుతున్నాయి. 2014 నుంచి ఇక్కడ తయారవుతున్న కొత్త వంగడాలు తెలంగాణ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడులు సాధించే రకాలను అధికారులు సృష్టిస్తుండటం విశేషం.

నిరంతర పరిశోధనలు

కేంద్రంలో నలుగురు శాస్త్రవేత్తలున్నారు. ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి పర్యవేక్షణలో నిరంతరం పరిశోధనలు సాగుతున్నాయి. ఇద్దరు బ్రీడర్, ఒకరు కీటక శాస్త్రవేత్తతో పాటు నలుగురు ఏఈఓలు, ఒక ఏఓ, ఆఫీస్ సిబ్బంది- ఇద్దరు, 34 మంది టైంస్కేలు వర్కర్లు పనిచేస్తున్నారు. పరిశోధన స్థానానికి అనుబంధంగా సాంకేతిక కళాశాలను 2013లో ఏర్పాటు చేశారు. ఇక్కడి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తూనే కళాశాలలో బోధిస్తున్నారు.

నూతన వంగడాల సృష్టి

జొన్న: మోతీ, కిన్నెర రకాల వంగడాలు సృష్టించారు. ఇవి ప్రాచుర్యం పొందాయి. వీటిని జొన్నరొట్టెలు, పశుగ్రాసం కోసం వినియోగిస్తున్నారు.


కంది: ఎంఆర్‌జీ 66, ఎంఆర్‌జీ 1004 మధ్యకాలిక రకాలు. ఇవి మ్యాక్రోఫోమినా ఎండుతెగులును తట్టుకుంటాయి.

పచ్చపెసర: ఐదు రకాలు విడుదల చేశారు. ఎంజీజీ 295, ఎంజీజీ 347 (మధిర పెసర), ఎంజీజీ 348(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), ఎంజీజీ 385(మధిర పెసర01) రకాలు.

మినుము: ఎంబీజీ 207, ఎంబీజీ 1070 రకాలు విడుదల చేశారు. చీడపీడలు తట్టుకొని అధిక దిగుబడులు ఇచ్చే పెసర, మినుము రకాలు రూపొందించారు. అధిక మొత్తంలో నూతన వంగడాలను ఉత్పత్తి చేసి టీఎస్ఎస్‌డీసీ, నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు అందజేస్తుంటారు.

నాణ్యమైన విత్తనోత్పత్తి ద్వారా పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచటమే లక్ష్యం. ఎంజీజీ 453, ఎంజీజీ 519, ఎంబీజీ 1110, ఎంబీజీ 1133 రకాలు పరీక్షలు పూర్తిచేసుకొని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఎంజీజీ 389, ఎంబీజీ 1080 రకాలకు రెండో ఏడాది చిరు సంచుల రూపంలో పరీక్షలు జరుగుతున్నాయి. డాక్టర్ కె.రుక్మిణీదేవి, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త

# నైనీ బ్లాకుకు రైల్వే సైడింగ్ నిర్మాణం



కొత్తగూడెం : ఒడిశా రాష్ట్రం అంగోల్ జిల్లాలోనున్న నైనీ బ్లాకులో ఉత్పత్తయ్యే బొగ్గు రవాణా చర్యలపై సింగరేణి యాజమాన్యం దృష్టిపెట్టింది. కొంతదూరం రైల్వే మార్గం ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. నైనీ బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ బ్లాకుకు ప్రత్యేక ప్రాజెక్టు అధికారిని నియమించి యాజమాన్యం కొంతకాలంగా ఉత్పత్తికి సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నుంచి బొగ్గు వెలికితీయనుంది. కోల్‌బ్లాకులో 340 మిలియన్ టన్నుల నిక్షేపాలుండగా.. ఏటా 100 లక్షల టన్నులు ఉత్పత్తి చేయనున్నారు. గని జీవిత కాలం 38 ఏళ్లుగా నిర్ధారించారు.

బ్లాకు ప్రారంభమైతే కొన్నాళ్లు బొగ్గును రోడ్డు రవాణా ద్వారా ఉత్పత్తి చేసేందుకు సింగరేణి సన్నాహాలు చేస్తోంది. కానీ దీర్ఘకాలంలో ఈ రవాణా అత్యంత వ్యయంతో కూడుకున్నది కావడంతో శాశ్వత రైల్వే లైన్ అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలోని తమ గనులకు కోలిండియా సంస్థలు ఏర్పాటు చేసుకోనున్న రైల్వే మార్గాన్ని వినియోగించుకునేందుకు సింగరేణి సన్నాహాలు చేస్తోంది. నైనీ బ్లాకు మీదుగానే కొద్దిదూరంలో కోలిండియాకు చెందిన కంపెనీలు తమ గనులకు రైలుమార్గాన్ని నిర్మించతలపెట్టాయి. అక్కడి వరకు రైల్వే సైడింగ్ పనులను చేపట్టేందుకు తాజాగా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకోసం రైల్వే బోర్డు అనుమతి తీసుకోవాలి. అనుమతి లభిస్తే నైనీ బ్లాకులో ఉత్పత్తయ్యే బొగ్గును రైల్వే మార్గం ద్వారా రవాణాకు వీలుకలుగుతుంది.

కొత్తమార్గానికి రైల్వేశాఖ పచ్చజెండా

ఒడిశా రాష్ట్రం అంగోల్ జిల్లాలోని తాల్చేరు కోల్‌ఫీల్డ్స్‌లో కేంద్రం సింగరేణితో పాటు కోలిండియాకు చెందిన మరో నాలుగు సంస్థలకు బొగ్గు బ్లాకులను కేటాయించింది. వీటిలో మహానది కోల్‌ఫీల్డ్స్, నేషనల్ అల్యూమినియం కార్పొరేషన్(నాల్కో), ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసీ), ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఒడిశా (ఇడ్కో) ఉన్నాయి. ఆ సంస్థలు రైలు మార్గం నిర్మాణం విషయమై కేంద్రంతో సంప్రదింపులు జరిపాయి. అంగోల్ వరకు ఉన్న రైలు మార్గాన్ని తమ బొగ్గు బ్లాకుల గుండా పొడిగించాలన్న విజ్ఞప్తికి కేంద్ర రైల్వే శాఖ అంగీకరించింది. కొత్త మార్గంలో బలరాం, తెంతులోయి, జార్పాండా వరకు రైల్వేలైన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రైల్వే లైన్‌ను జార్పాండాకు కొద్ది దూరంలోనే ఉన్న నైనీ బొగ్గు బ్లాకు వరకు పొడిగించాల్సిందిగా సింగరేణి సైతం రైల్వే శాఖను కోరింది. కానీ అందుకు రైల్వేశాఖ అంగీకరించకపోవడంతో కొద్దిదూరం మేర సొంతంగా రైల్వే సైడింగ్ నిర్మాణ పనులు చేపట్టాలని యాజమాన్యం నిర్ణయించింది. జాయింట్ వెంచర్‌గా ఏర్పడి రైల్వే లైనును సాధించుకున్న మిగతా కంపెనీలు సింగరేణితో కలిసేందుకు నిరాకరించాయి. భాగస్వామిగా కాకుండా రైల్వే రవాణా ఛార్జీల చెల్లింపు పద్ధతిపై జాయింట్ వెంచర్ మార్గం సేవలను వినియోగించుకునేందుకు సింగరేణి నిర్ణయం తీసుకుంది. ఈలోగా సొంత వ్యయంతో రైల్వే సైడింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

# తాలిపేరు.. నిర్వహణ మరిచారు!


కొత్తగూడెం : వేసవిలో చేపట్టాల్సిన ప్రాజెక్టు నిర్వహణ (మెయింటెనెన్స్) పనులను అధికారులు పట్టించుకోలేదు. ఏటా మే నెలలో ప్రాజెక్టు నిర్వహణ పనులు పూర్తిచేసి ఖరీఫ్‌కు ముందే సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలి. గేట్ల ఆపరేషన్, గ్రీజింగ్, మెకానికల్, విద్యుద్దీకరణ, ఇతరత్రా సవ్యంగా ఉండేలా మరమ్మతులు చేపట్టాలి. తొలకరి పలకరింపునకు వేళయినా ఇప్పటికీ చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నిర్వహణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. 25 గేట్ల ఆపరేషన్‌కు సంబంధించి రోప్ ఆయిలింగ్, గ్రీజింగ్, బేరింగ్, మోటర్ మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్రాజెక్టు గేట్లు ఎత్తలేదు. గేట్ల పనితీరునూ పరిశీలించలేదు.

మెకానిక్ పనులకు మోక్షమేదీ?

ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లకు సంబంధించిన బ్రేకర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఏటా వరదల సమయంలో గేట్లు ఎత్తేందుకు సిబ్బందికి తంటాలు తప్పటం లేదు. ప్రాజెక్టుకు ఇటీవల కొత్త 125 కేవీఏ జనరేటర్ సమకూర్చారు. స్టాండ్‌బైగా ఉన్న 35 కేవీఏ జనరేటర్‌కు మరమ్మతులు, క్రషర్ గేట్ల బేరింగ్, వెల్డింగ్ పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. గ్యాలరీలో లీకేజీలను అరికట్టే గ్రౌటింగ్ పనులకు ఏళ్ల తరబడి మోక్షం లభించటం లేదు.

హెడ్ రెగ్యులేటర్ గేట్లు, ఈఎం బ్రేక్స్ మారేనా..!

ప్రాజెక్టు ప్రధాన ఎడమ, కుడి కాల్వల హెడ్ రెగ్యులేటర్ల గేట్లు సవ్యంగా పనిచేయటం లేదు. ప్రధాన కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్ షట్టర్లను మార్చాలి. గేట్లు లేవకపోవటంతో నీటి విడుదల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టు 25 గేట్లకు సంబంధించిన ఈఎం (ఎలక్ట్రో మ్యాగ్నటిక్) బ్రేక్స్ కొన్నేళ్లుగా పనిచేయటం లేదు. ఏటా వరదల సందర్భంలో గేట్లు



ఎత్తేందుకు సిబ్బంది తంటాలు పడుతున్నారు. ఎగువ నుంచి ఎప్పుడు భారీగా వరద వస్తుందో తెలియక.. ఈఎం బ్రేక్స్ పనిచేయక.. కట్టెలు అడ్డంగా పెట్టి సిబ్బంది గేట్లు ఎత్తాల్సిన దుస్థితి దాపురించింది. వాటి నిర్వహణ మరింత క్లిష్టంగా మారుతోంది.


కాల్వలకు సంబంధించి ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులు జరుగుతున్నాయి. జనవరి, ఫిబ్రవరిలోనే గ్రీజింగ్ చేశాం. పుల్లీ బేరింగ్‌లు అమర్చుతాం. ప్రధాన ఎడమ, కుడికాల్వల హెడ్ రెగ్యులేటర్ల షట్టర్లు నుంచి నీరు లీకవుతోంది. వాటి స్థానంలో కొత్తగా షట్టర్ల ఏర్పాటు ప్రక్రియను వారంలో ప్రారంభిస్తాం. నిర్వహణ పనుల్లో భాగంగా గతంలోనే రోప్ ఆయిలింగ్ చేశాం. లిమిట్ స్విచ్‌లు, ఈఎం బ్రేక్స్‌ను త్వరలోనే అమర్చుతాం. తిరుపతి, డీఈ

# సోమేశ్వరాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యం

వరంగల్ : రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో పాలకుర్తిలోని సోమేశ్వరాలయం ఒకటి. ఇక్కడి క్షీరాద్రిపై సోమేశ్వరుడు, లక్ష్మీనరసింహస్వామి స్వయంభువులుగా వెలిశారు. అంతేకాక పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఈ ఆలయ పరిసరాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కానీ సోమేశ్వరాలయంలో దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఆలయంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సిబ్బంది వ్యవహరిస్తుంటారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విధుల్లో నిర్లక్ష్య ధోరణి

ఆలయంలో పనిచేసే కొందరు సిబ్బంది, అర్చకులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు విధులకు రాకుండానే రిజిస్టర్‌లో సంతకాలు చేస్తారని, మరికొందరు ఎలాంటి సమాచారం లేకుండానే విధులకు గైర్హాజరవుతారు. ఓ ఉద్యోగి ముందస్తు సమాచారం లేకుండా కొన్ని రోజులు విధులకు రాలేదు. దీంతో ఈవో లక్ష్మీప్రసన్న నోటీసులు జారీ చేశారు. ఉద్యోగి నుంచి వివరణ రాకపోవడంతో సస్పెండ్ చేశారు. అర్చకులు సైతం సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారి స్థానంలో ఇతరులను విధుల్లో ఉంచుతారని,



నిత్య పూజల విషయంలోనూ జాప్యం చేస్తుంటారని తెలిసింది. ఆలయాన్ని తెరవడం, మూసివేయడంలోనూ కాలయాపన చేస్తుంటారని సమాచారం. ఆలయంలో మొత్తం సిబ్బంది సుమారు 26 మంది ఉన్నారు. వాహనాలను కూడా క్షీరాద్రిపై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తుంటారు.

జాతరకు రెట్టింపు ఖర్చులు

సోమేశ్వరాలయంలో ఏటా మహాశివరాత్రి జాతరను వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిసారీ జాతరకు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు చేస్తారు. ఈసారి ఆయా ఖర్చులు రెట్టింపయ్యాయి. సుమారు రూ.20 లక్షలకు పైగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఓ ఉన్నతాధికారి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే ఖర్చులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అధికారులు వాపోయారు. చండికా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సైతం భారీగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

గణనీయంగా అభివృద్ధి

అభివృద్ధిపరంగా సోమేశ్వరాలయ రూపురేఖలు మారాయి. గర్భగుడితో పాటు క్షీరాద్రి ఆలయ ప్రాంగణం, మెట్ల సుందరీకరణ, కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేశారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఈ పనులు చేపట్టారు. ప్రభుత్వం వీటికి అదనపు నిధులు సైతం కేటాయించింది. కొందరు అధికారులు, అర్చకులు ఆలయంలో అవసరం లేని పనులు చేయించారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. బుకింగ్ కేంద్రాన్ని ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. నవగ్రహాలను రక్షణ లేదని భక్తులు చెబుతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు- లక్ష్మీప్రసన్న, ఈవో, సోమేశ్వ రాలయంఅధికారులు, సిబ్బంది, అర్చకులు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. ఇటీవల ఈ విషయంలో ఉద్యోగిని కూడా తప్పించాను. ఎవరి విధులు వారు నిర్వహించాల్సిందే. సీసీ కెమెరాల దృశ్యాల ద్వారా నిత్యం ఆలయంలో జరిగే కార్యక్రమాలు, చర్యలను పర్యవేక్షిస్తుంటా.

# నగరంలో ఇక మురుగు కంపే!

వరంగల్ : స్మార్ట్‌సిటీ పథకంలో ప్రతిపాదించిన కీలకమైన ప్రాజెక్టులు ఒక్కొక్కటి చేజారుతున్నాయి. భవిష్యత్తు అవసరాల కోసం ప్రతిపాదించిన ముఖ్యమైన పనులు పక్కకు నెట్టేస్తున్నారు. ఇప్పటికే ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుకు రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) మరుగున పడ్డాయి. తాజాగా హనుమకొండ రెడ్డిపురం చెరువు వద్ద ప్రతిపాదించిన రోజుకు 100 మిలియన్ లీటర్ల మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రం(ఎస్టీపీ) పనులు రద్దు చేశారు. సుమారు రూ.200 కోట్లతో టెండర్లు పిలిచినప్పటికీ స్థలాలు లభించడం లేదంటూ పక్కకుపెట్టేశారు. ఇప్పటికే డంపింగ్ యార్డులోని చెత్తతో కంపు కొడుతున్న నగరానికి మురుగు కూడా తోడవనుంది.

స్మార్ట్‌సిటీ పథకంలో మురుగునీటి శుద్ధీకరణ అంశం కీలకం. రెడ్డిపురంలో 100 ఎంఎల్‌డీలు, కాజీపేట బంధం చెరువు వద్ద 15 ఎంఎల్‌డీలు, ఉర్సు చెరువు వద్ద 5 ఎంఎల్‌డీల ఎస్టీపీలు డిజైన్ చేశారు. కాజీపేట, ఉర్సు చెరువు వద్ద నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రద్దు చేసిన రెడ్డిపురం ప్రాజెక్టు నిధులను ప్రజాప్రతిధులు సూచించిన దగ్గర కొత్తగా ప్రతిపాదించారని తెలిసింది. ఆధునిక, సాంకేతిక ప్రాజెక్టులు అమలయ్యేలా చూడాల్సిన ప్రాజెక్టు మానిటరింగ్ కమిటీ (పీఎంసీ) నిపుణులు ఏమీ పట్టనట్లుగా ఉంటున్నారనే విమర్శలున్నాయి.

చెరువులు కలుషితం

వరంగల్ త్రినగరి నుంచి వెలువడుతున్న మురుగునీటితో ఇప్పటికే చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయి. నగర శివారులోని నాగారం, రెడ్డిపురం, ములుగురోడ్ కోట చెరువు, దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువులను మురుగు ముంచెత్తుతోంది. సమీపంలో ఉన్న కాలనీల్లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. బోర్లు, మంచినీటి బావుల్లో రంగు మారిన నీళ్లు వస్తున్నాయని స్థానిక ప్రజలంటున్నారు. రంగశాయిపేట బెస్తం చెరువు, మద్దెలకుంట, న్యూశాయంపేట కోటి చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువులకు మురుగు చేరుతోంది.

నగరంలో వెలువడే మురుగులో ఎక్కువ శాతం నాగారం చెరువులోకి వెళ్తాయి. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని నిపుణుల కమిటీ హెచ్చరించింది. చెరువులు, కుంటలు కలుషితం కాకుండా చూడాల్సిన గ్రేటర్ వరంగల్ పాలకులు పట్టింపు లేకుండా ఉంటున్నారు.

రోజూ 120 ఎంఎల్‌డీలు

త్రినగరి నుంచి ప్రతి రోజూ 120 మిలియన్ లీటర్ల మురుగు నీరు వస్తుంటుంది. వచ్చే పదేళ్ల నాటికి 150-180 ఎంఎల్‌డీలకు చేరుకుంటుందని అంచనా. చిన్న చిన్న పట్టణాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, తగినన్ని మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వరంగల్‌లో చూస్తే ఈ రెండూ లేని లోటుతో ప్రజలు కంపును భరాయించాల్సి వస్తోంది.



## అంబేద్కర్ విగ్రహం సందర్శనకు ప్రజలు.. తిప్పిపంపుతున్న పోలీసులు.. కారణమిదే

విజయవాడ, జనవరి 20: నగరంలో 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహ సందర్శనకు వచ్చిన ప్రజలను పోలీసులు అడ్డుకోవడం.. దాని వెనుకున్న కారణాలు ప్రస్తుతం ఏపీలో హాట్ టాపిక్‌గా మారాయి. నిన్న స్వరాజ్ మైదాన్‌లో రాజ్యాంగ రూపకర్త బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహ ఆవిష్కరణ సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగింది. నేటి నుంచి అంబేద్కర్ విగ్రహ సందర్శనకు అనుమతి ఉంటుందని ప్రకటించడంతో ఉదయం నుంచే ప్రజలు.. అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం సందర్శనకు తరలివస్తున్నారు. తీరా అక్కడకు వచ్చిన ప్రజలను పోలీసులు, అధికారులు అడ్డుకుంటున్నారు. లోపలకు వెళ్లేందుకు అనుమతి లేదంటూ ప్రజలను తిప్పిపంపించేస్తున్నారు. అమలాపురం, విశాఖ ప్రాంతాల నుంచి వచ్చామని విన్నవించినా అధికారులు స్పందించని పరిస్థితి.

**కారణమిదే...** అయితే లోనికి అనుమతించకపోవడానికి అసలు కారణమేంటో తెలిసి ప్రజలు మండిపడుతున్నారు. ఐప్యాక్ టీం ఆధ్వర్యంలో మినీ థియేటర్‌లో మంత్రులతో పార్టీ కార్యక్రమం షూటింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. స్మృతివనం వద్ద రోడ్డుపై ఆరుగురు మంత్రుల కాన్వాయ్ వాహనాలు ఉన్నాయి.

దీంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నేటి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు అనుమతి ఉంటుందని ముందుగా ప్రకటించి.. అక్కడకు వచ్చాక అడ్డుకోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తే వెనక్కి పంపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా... ఐప్యాక్ టీం షూటింగ్ కోసం ప్రజలను పోలీసులు తిప్పి పంపడం పట్ల సర్వాత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## షర్మిల ఆపరేషన్ షురూ -కాంగ్రెస్ లోకి ఇద్దరు ఎమ్మెల్యేలు, లిస్టులో..!!

ఏపీలో ఎన్నికల రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. రాష్ట్రంలో త్రిముఖ పోరు ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి జగన్ అభ్యర్ధుల ఎంపిక కసరత్తు తుది దశకు చేరింది. టీడీపీ, జనసేనతో బీజేపీ కలుస్తుందా లేదా అనేది క్లారిటీ రావాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా బీజేపీ నిర్ణయం తీసుకుంటుందని చెబుతున్నారు. ఈ సమయంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా షర్మిల బాధ్యతలు తీసుకుంటున్నారు. పార్టీలో చేరికలే లక్ష్యంగా తొలి అడుగులు వేస్తున్నారు. షర్మిల బాధ్యతలు: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల ఆదివారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి నాలుగు గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడ తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తారు. ప్రత్యేక విమానంలో షర్మిలతో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు సహా కాంగ్రెస్ నేతలు ఇడుపులపాయ వెళతారు. ఆదివారం ఉదయం కడప నుంచి ప్రత్యేక విమానంలో షర్మిల గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం విజయవాడలో ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఉదయం 11 గంటలకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరిస్తారు.



**కాంగ్రెస్ లో చేరికలు:** షర్మిల బాధ్యతలు స్వీకరించిన వెంటనే పార్టీలో చేరికల ద్వారా ఎంట్రీతోనే ప్రభావం చూపాలని భావిస్తున్నారు. అందులో భాగంగా బాధ్యతల స్వీకరణ వేళ భారీగా పార్టీ అభిమానులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తొలి నుంచి వైఎస్ కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్నారు. ఆయన షర్మిల పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టుగా పార్టీ ముఖ్యనేతలు వెల్లడించారు. మంగళగిరి ఎమ్మెల్యే బాటలోనే.. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సహా.. రాయలసీమలోని పలువురు నేతలు కాంగ్రెస్ లో చేరతారని చెబుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో తాజాగా సీటు దక్కని మరో ఎమ్మెల్యేతోనూ కాంగ్రెస్ సీనియర్ నేత టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వైసీపీతో పాటుగా టీడీపీ నేతలు కొందరితో కాంగ్రెస్ ముఖ్యులు మంతనాలు చేస్తున్నారని సమాచారం.

## జగన్ దోచేది ఎక్కువ.. జనాలకు ఇచ్చేది తక్కువ: చంద్రబాబు

అరకు: ఎంతో ప్రత్యేకత కలిగిన అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేయాలని తెదేపా అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దావోస్‌కు ఇప్పటికే అరకు కాఫీ రుచి చూపించామన్నారు. అల్లూరి జిల్లా అరకులో నిర్వహించిన 'రా.. కదలి రా' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తెదేపా అరకు కాఫీని ప్రమోట్ చేస్తే.. వైకాపా గంజాయిని చేస్తోందని విమర్శించారు. "గిరిజనుల పొట్టకొట్టే ప్రభుత్వం వైకాపా. నమ్మించి గొంతు కోసిన వ్యక్తి జగన్. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని సంకల్పించా. నేను గతంలో ఇచ్చిన జీవో నెంబర్ 3ని ఎందుకు రద్దు చేశారో వైకాపా చెప్పాలి. సామాజిక న్యాయం చేస్తానని సీఎం గొప్పలు చెబుతున్నారు. జీవో నెంబర్ 3 రద్దు చేయడం సామాజిక న్యాయమా? మళ్లీ తెదేపా అధికారంలోకి రాగానే దానిని పునరుద్ధరిస్తాం. గిరిజనుల కోసం మేం 16 పథకాలు ప్రత్యేకంగా తీసుకొచ్చాం. వాటిని ఎందుకు రద్దు చేశారో జగన్ చెప్పాలి. గిరిజనుల పిల్లలు చదువుకోవడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం రద్దు చేశారు. ప్రపంచంలో ఎక్కడ చదివినా గిరిజనులకు స్కాలర్‌షిప్పులు ఇస్తే.. దాన్నీ తీసేశారు. నైపుణ్యం కోసం శిక్షణ కేంద్రాలు పెడితే వాటినీ ఊడగొట్టారు. గిరిపుత్రిక కల్యాణ పథకాన్నీ రద్దు చేశారు. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చిన ఘనత తెదేపాది. గిరిజనుల



సహజ సంపదను దోచుకునే వ్యక్తి జగన్" అని చంద్రబాబు మండిపడ్డారు. "గిరిజన ప్రాంతంలో ఎక్కడైనా రహదారి వేశారా? సకాలంలో వైద్యం అందకపోవడంతో చిట్టంపాడుకు చెందిన గర్భిణి చనిపోయారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకుపోవాలంటే అంబులెన్స్ పంపలేదు. స్కూటర్‌పై ఎక్కించుకొని ఇంటికి తీసుకుపోవాల్సిన పరిస్థితి. ఆయన నొక్కే బటన్ ఒకటి.. బొక్కే బటన్ ఒకటి. జగన్ దోచేది ఎక్కువ.. జనాలకు ఇచ్చేది తక్కువ. విద్యుత్ ఛార్జీలు ఐదు రెట్లు పెంచేశారు" అని చంద్రబాబు విమర్శించారు.




ఉరవకొండ: అనంతపురం జిల్లా ఉరవకొండలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అంగన్వాడీల నుంచి నిరసన సెగ తగిలింది. ఈ నెల 23న సీఎం జగన్ పర్యటన ఉండటంతో సభాస్థలాన్ని పరిశీలించడానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా పెద్దిరెడ్డి నగరానికి వచ్చారు. ఈ క్రమంలో కాన్వాయ్‌ను వెళ్లనీయకుండా అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దాదాపుగా అరగంట పాటు రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మహిళలని కూడా చూడకుండా పోలీసులు బలవంతంగా లాగిపడేస్తూ అతికష్టం మీద మంత్రి వాహనాన్ని ముందుకు పంపించారు.

## రాజకీయాలకు అతీతమైన వ్యక్తి ఎన్టీఆర్..



అనంతపురం, జనవరి 20: ఉరవకొండలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ఉరవకొండలో బీజేపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చిందే ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ నిలబెట్టారని తెలిపారు. రాజకీయాలకు అతీతమైన వ్యక్తి ఎన్టీఆర్ అని చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ ఆ రోజుల్లో తీసుకొచ్చిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనే ఇవాల్టికీ అన్ని రాజకీయ పార్టీలు కొనసాగిస్తున్నాయన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా ఇవాళ ఎన్టీఆర్ పేరు ఎత్తకుండా రాజకీయాలు మాట్లడలేని పరిస్థితి ఏర్పడిందని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి పేర్కొన్నారు.

కాగా.. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్.. టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. విగ్రహావిష్కరణలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంధిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహర్షి వాల్మీకి ఎయిర్ పోర్టుకు భారీ భద్రత



ఈ నెల 22న జరగనున్న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా.. అయోధ్య విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం భారీగా భద్రత పెంచింది. 150 మందికి పైగా సిబ్బందిని సీఐఎస్ఎఫ్ యాంటీ టెర్రరిస్ట్ కవర్‌ను మంజూరు చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలో 68 వ విమానాశ్రయ టెర్మినల్‌గా మారింది. 2023 డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన అయోధ్య విమానాశ్రయానికి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) భద్రత అందించనుంది. ప్రయాణికులు రాకపోకలు సాగించే ఎయిర్ గేట్‌వే సదుపాయానికి ముప్పు ఉన్న నేపథ్యంలో ఎయిర్ పోర్టుకు భద్రత కల్పిస్తున్నట్లు సీఐఎస్ఎఫ్ వెల్లడించింది. ప్రారంభోత్సవం సందర్భంగా దేశ విదేశాల నుంచి పలువురు రానున్నందున అయోధ్యలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎయిర్ పోర్టుకు సెక్యూరిటీ కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే ఈ సంఖ్యను మరింత పెంచుతామన్నారు. మొదటి దశలో, విమానాశ్రయం 65,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. గంటకు రెండు నుంచి మూడు విమానాలు రాకపోకలు సాగించేలా నిర్మించారు. బోయింగ్ 737, ఎయిర్‌బస్ 319, 320 ఈ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. రెండో దశలో రన్‌వే పొడవు 2,200 మీటర్ల నుంచి 3,700 మీటర్లకు పెరుగుతుంది. తద్వారా బోయింగ్ 787, బోయింగ్ 777 వంటి అంతర్జాతీయ విమానాలు అయోధ్యలో ల్యాండ్ అవుతాయి. 50,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎయిర్ పోర్టు విస్తరించి ఉంటుంది.




## ఆన్‌లైన్‌లో అయోధ్య పేరిట నకిలీ ప్రసాదం.. అమెజాన్‌కు నోటీసులు

అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం జరగనున్న వేళ ఆన్‌లైన్‌లో నకిలీ ప్రసాదాల విక్రయాలు కలకలం రేపుతున్నాయి. 'అయోధ్య ప్రసాదం' పేరిట మిఠాయిలను అమ్ముతోందనే ఆరోపణలతో ఈ కామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్‌కు కేంద్రం నోటీసులు జారీ చేసింది. రామ ప్రసాదం పేరిట నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తూ ఆన్‌లైన్ కస్టమర్లను అమెజాన్ తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపిస్తూ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. శ్రీరామ మందిర్ అయోధ్య ప్రసాద్, రఘుపతి నెయ్యి లడ్డూ, ఖోయా ఖోబీ లడ్డూ, అయోధ్య రామ మందిర్ అయోధ్య ప్రసాద్, దేవీ ఆవు పాలు.. ఇలా మరికొన్నింటిని అమ్ముతున్నట్లు అందులో పేర్కొంది. ఫిర్యాదుపై స్పందించిన సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) అమెజాన్‌కు నోటీసులు జారీ చేసింది.

వారంలోగా వివరణ ఇవ్వాలంటూ గడువు ఇచ్చింది. లేదంటే వినియోగదారుల రక్షణ చట్టం-2019 ప్రకారం సంస్థపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఆరోపణలపై అమెజాన్ ప్రతినిధి ఒకరు స్పందించారు. కస్టమర్లను తప్పుదోవ పట్టిస్తున్న విక్రేతలపై చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. దీంతోపాటు రామ మందిర ప్రసాదం పేరిట ఉన్న ఉత్పత్తుల సేల్స్ ఆప్షన్‌ను తొలగించినట్లు వెల్లడించారు.




ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత 'సిఖ్స్ ఫర్ జస్టిస్' నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న భారతీయుడు నిఖిల్ గుప్తాను అమెరికాకు అప్పగించేందుకు చెక్‌రిపబ్లిక్ కోర్టు అనుమతించింది. దీనికి సంబంధించిన తుది నిర్ణయాన్ని ఆ దేశ న్యాయ మంత్రిత్వ శాఖకు వదిలేసింది.

అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని ఇటీవల అగ్రరాజ్యం వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కుట్ర కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా ప్రమేయం ఉందంటూ కొద్దినెలల క్రితం అమెరికా అటార్నీ కార్యాలయం ఆరోపించింది. ఇందుకోసం అతడికి ఓ భారత ప్రభుత్వ అధికారి నుంచి ఆదేశాలు అందాయని యూఎస్ ఆరోపణలు చేసింది. దీన్ని భారత్ తీవ్రంగా పరిగణించింది. ఈ కేసులో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరుపుతామని ప్రకటించింది. మరోవైపు, 52 ఏళ్ల నిఖిల్ గుప్తాను గత ఏడాది జూన్‌లో చెక్ రిపబ్లిక్ అధికారులు అరెస్టు చేశారు. ప్రస్తుతం అతడు ప్రాగ్‌లోని ఓ జైల్లో ఉన్నాడు. నిఖిల్‌ను తమకు అప్పగించాలని ఆ దేశంపై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ క్రమంలోనే చెక్ రిపబ్లిక్ కోర్టు నుంచి అనుమతి లభించింది. దీనిపై అక్కడి న్యాయమంత్రిత్వ శాఖ ప్రతినిధి మీడియాతో మాట్లాడారు. ఈ అప్పగింతపై న్యాయమంత్రి తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. దీనిపై మంత్రికి ఏవైనా సందేహాలు ఉంటే.. సమీక్ష నిమిత్తం సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు అవకాశముందని తెలిపారు. గుప్తా తరపు న్యాయవాదులు కూడా అప్పగింతకు వ్యతిరేకంగా ఇతర న్యాయమార్గాలను ఆశ్రయించడానికి వీలుందని చెప్పారు.

## సర్వదర్శనానికి 18 గంటల సమయం



తిరుపతి : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఉచిత సర్వదర్శనానికి 16 కంపార్ట్‌మెంట్లలో వేచివున్న భక్తులు. దర్శనానికి 18 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పేర్కొంది. రూ.300 ప్రత్యేక దర్శనానికి 3 గంటల సమయం పడుతోందని వెల్లడించింది.

మరోవైపు.. టైమ్ స్లాట్ ఎస్ఎస్‌డి దర్శనం కోసం 8 కంపార్ట్‌మెంట్‌లలో భక్తులు వేచి ఉండగా.. 5 గంటల సమయం పడుతోంది. ఇక.. నిన్న(శుక్రవారం) స్వామివారిని 69,874 భక్తులు దర్శించుకున్నారు. అందులో 26,034 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారి హుండీ ఆదాయం 3.39 కోట్లుగా లెక్క తేలింది. వచ్చే 22న అయోధ్య రామా మందిరం ప్రారంభం.. నేడు ప్రత్యేక ఫ్లైట్‌లో అయోధ్య చేరనున్న టీటీడీ శ్రీవారి లడ్డులు. దేశీయ ఆవునెయ్యిని వినియోగించి లక్ష లడ్డూలు తయారి. నిన్న రాత్రి తిరుమల నుండి బయలుదేరిన లడ్డులు.

## సీఎం జగన్‌కు తెలియకుండానే కృష్ణపట్నం పోర్టు తరలిపోతుందా?

నెల్లూరు : కృష్ణపట్నం కంటైనర్ టెర్మినాల్ మూతపడిపోనుందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి వచ్చే వెయ్యి కోట్ల ఆదాయం నిలిచిపోనుందని అన్నారు. కృష్ణపట్నం పోర్టు రావడానికి చంద్రబాబు ముఖ్య కారణమన్నారు. కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ మూతపడితే దాదాపు పది వేలమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. భూములిచ్చిన రైతులు తీవ్రంగా నష్టపోనున్నారన్నారు. ఇంత పెద్ద పోర్ట్ తరలిపోతుంటే రివ్యూ చేయించే ఆలోచన సీఎంకి లేదా? మంత్రికి, ముఖ్యమంత్రికి తెలియకుండానే ఇంత జరుగుతుందా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కన్నెర్ర చేస్తే వెళ్తున్నారో? మంత్రి ఆరాచకం వలన వెళ్తున్నారో? అర్థం కావడం లేదన్నారు. చెన్నై, ముంబై, విశాఖ తరువాత ఆ స్థాయి పోర్ట్ తరలిపోతోందని.. పోర్ట్ ఆధారిత పరిశ్రమలు ఇక మూత పడుతాయన్నారు. కృష్ణపట్నం పోర్ట్ తరలిపోవడం వలన కొన్ని పరిశ్రమలకు ట్రాన్స్‌పోర్ట్ అధిక భారం అవుతుందన్నారు. ఆరు వేల ఎకరాలు ఎస్ఈజడ్ విలువైన భూములు నిర్వీర్యం అవుతాయన్నారు. ప్రజల దగ్గర తీసుకున్న విలువైన భూములు వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఇంత వరకు ఆపేందుకు ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. ఐదు రోజుల్లో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఒకప్రక్క విశాఖ ఉక్కు, మరోప్రక్క కృష్ణపట్నం పోర్టు కనుమరుగు కావడం రాష్ట్రానికి తీరని నష్టమని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

## మాళవిక సూపర్ హాట్ షో ఇది!

ముంబై బ్యూటీ మాళవికా మోహనన్ టాలీవుడ్ లో ఇంకా లాంచ్ అవ్వలేదు. కానీ అమ్మడు ఇన్ స్టా అభిమా నులు బాగా సుపరిచితురాలే. ఎప్పటికప్పుడు సెగలు పుట్టించే ఫోటోలతో కుర్రాళ్లని ఆకర్షిస్తుంది. నాలో వేడిని చూడండి అంటూ మత్తెక్కించే భంగిమలతో కనికట్టు చేసేస్తుంది. తాజాగా మరో హాట్ ఫోటోతో నెట్టింట రచ్చ షురూ చేసింది. ఇదిగో ఇక్కడిలా మాళవిక హాట్ షోకి ఫిదా కానిది ఎవరు అంటూ ఛాలెంజ్ విసిరింది. జీన్స్ ప్యాంట్ మ్యాచింగ్ జీన్స్ పేరుకు మాత్రమే ధరించింది. అందాల ఆరబోతలో నన్ను బీట్ చేసేది? ఎవరు అంటూ చెలరేగింది. టాప్ టూ హిప్ వరకూ మాళవిక అందాల్లో చిత్తు అవ్వాల్సిందే అన్న రేంజ్ లో చెలరేగింది. లో దుస్తుల్లో అమ్మడు చెమటలు పట్టించేస్తుంది. వేసుకున్న షర్ట్ ని అలా జెబ్బల కిందకు జార విడిచి బ్యూటీని క్యాప్చర్ చేయండి అంటూ ఇలా వదిలేసింది. నాభి అందాల్లో సైతం నాకెవ్వరు సాటి అనిపించింది. లో దుస్తులు మ్యాచింగ్ మెన్స్ వాచ్ ధరించింది. కెమెరా కి ఇచ్చిన



భంగిమ అంతకు మించి సెన్సేషన్. మొత్తంగా టాప్ టూ బాటమ్ మాళవిక అంటే మంటలు పుట్టాల్సిందే అనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. దీంతో ఫాలోవర్స్ ఎవరి స్టైల్లో వారు చెలరేగుతున్నారు. టాలీవుడ్ లో డెబ్యూ కి ముందే సొగసరి ఈ రకంగా తెలుగింట ఫేమస్ అయిపోతుంది. సినిమాలు చేసి సక్సెస్ అయితే ఫాలోయింగ్ ఇంకే రేంజ్ లో ఉంటుందో ఊహకే అందదు. ఈ బ్యూటీ తొలుత మాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. అటుపై కన్నడ..హిందీలోనూ సినిమాలు చేసింది. అయితే పేరొచ్చింది మాత్రం కోలీవుడ్ చిత్రాలతోనే. తొలుత సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన పేటలో ఛాన్స్ అందుకుంది. ఆ తర్వాత విజయ్ నటించిన మాస్టర్ మూవీలో విభిన్న పాత్రలో కనిపించింది. కానీ రెండు సినిమాలు అమ్మడికి అనుకున్నంత గుర్తిం పును తీసుకురాలేదు. స్టార్ హీరోల చిత్రాల్లో భాగమైంది అన్న ఇమేజ్ తప్ప సక్సెస్ పడలేదు. ప్రస్తుతం చియాన్ విక్రమ్ సరసన ప్రతిష్టాత్మక చిత్రం తంగలాన్‌లో నటిస్తోంది. ఆశలన్నీ ఈ సినిమాపైనే ఉన్నాయి.

## వరలక్ష్మి క్యారెక్టర్స్.. అలా అనుకుంటే పొరపాటే

సీనియర్ నటుడు శరత్ కుమార్ వారసురాలిగా వరలక్ష్మి శరత్ కుమార్ సౌత్ ఇండస్ట్రీలో దూసుకుపోతోంది. పాజిటివ్ నెగిటివ్ రోల్స్ అని తేడా లేకుండా మంచి కంటెంట్ ఉన్న క్యారెక్టర్స్ సెలెక్ట్ చేసుకుంటున్న విధానం కెరీర్ కు మరింత బూస్ట్ ఇస్తోంది. సినిమా సినిమాకు ఆమె క్యారెక్టర్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. ముఖ్యంగా తెలుగు ఇండస్ట్రీలోనే ఇప్పుడు అమ్మడికి చాలా మంచి అవకాశాలు వస్తున్నాయి. ఆమె నటించిన ఏదో ఒక సినిమా సంక్రాంతి టైంలో రావడమే కాకుండా మంచి సక్సెస్ కూడా అవుతున్నాయి. అంతేకాకుండా ఆ సినిమాలలో ఆమె క్యారెక్టర్ ఎక్కువగా చనిపోతూ ఉండడం ఒక ఆశ్చర్యకరమైన విషయం. ఇది అనుకోకుండా జరిగే పరిణామమే అయినప్పటికీ కూడా ఇండస్ట్రీలో ఆ సెంటిమెంట్ అలా హైలైట్ అవుతోంది. వరలక్ష్మీ శరత్ కుమార్ మొదట తమిళంలో హీరోయిన్ గా అవకాశాలు అందుకుంది. అయితే హీరోయిన్ గా



ఆమెకు పెద్దగా గుర్తింపు రాకపోవడంతో అమ్మడు ఆ తర్వాత విలన్ క్యారెక్టర్స్ తో మంచి క్రేజ్ అందుకుంది. ఆమె కెరీర్ ను మలుపు తిప్పింది మాత్రం విజయ్ సర్కార్ సినిమానే. అందులో పవర్ఫుల్ విలన్ గా ఆమె కేవలం తన లుక్స్ తోనే అదరగొట్టేసింది. ఇక తర్వాత తెలుగులో క్రాక్ సినిమా ఆమెకు మరింత పేరు తెచ్చింది. అనంతరం వీర సింహారెడ్డి లో హీరో చెల్లెలిగా కూడా నెగిటివ్ షేడ్స్ లో మరింత హైలెట్ అయ్యింది. ఇక రీసెంట్ గా వచ్చిన హనుమాన్ సినిమాలో కూడా హీరోకు సోదరి పాత్రలో కనిపించింది. అయితే ఈ మూడు సినిమాలు సంక్రాంతికి రాగా అన్నింటిలోనూ ఆమె క్యారెక్టర్స్ అన్నీ కూడా కథలో చనిపోతాయి. ఇక వరలక్ష్మి చనిపోయే క్యారెక్టర్స్ ఇస్తే సక్సెస్ అవుతాయి అనుకుంటే పొరపాటే. ఒక విధంగా సినిమా కంటెంట్ కూడా క్లిక్ అయింది కాబట్టి ఆమె చేసిన పాత్రలకు కూడా మరింత బలం వచ్చింది. ఇక వరలక్ష్మి అయితే రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్లో క్యారెక్టర్స్ ఉంటే వెంటనే రిజెక్ట్ చేస్తోంది. కొన్ని చిన్న సినిమాలలో కూడా ఆమె చేసిన పాత్రలు అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అల్లరి నరేష్ నాంది సినిమాకు చాలా తక్కువ పారితోషికం తీసుకుని లాయర్ గా కనిపించింది. ఆ విధానం నటనపై ఆమెకు ఉన్న మక్కువను తెలియజేస్తోంది. అలాగే సమంత యశోద సినిమా, సందీప్ కిషన్ మైకేల్ సినిమాలలో కూడా ఆమె పాత్రలకు మంచి గుర్తింపు లభించింది. రీసెంట్ గా వచ్చిన కోటబొమ్మాలిలో కూడా వరలక్ష్మి మంచి పాత్రలోనే కనిపించింది. ఇక ప్రస్తుతం ఆమె కథానాయకగా శబరి అనే ఒక సినిమా చేస్తోంది. మరి ఆ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.




## 1000 కోట్ల టార్గెట్ తో దేవర.. ప్లాన్ అదుర్స్..!



RRR తో గ్లోబల్ స్టార్ గా ఎదిగిన యంగ్ టైగర్ ఎన్.టి.ఆర్ మాన్ ఆఫ్ మాసెస్ అవతారం ఎత్తాడు. ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న దేవర సినిమా తో మరోసారి బాక్సాఫీస్ పై టైగర్ పంజా విసరనున్నాడు. ఈ సినిమా విషయంలో ప్రతి విషయాన్ని చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. యువ సుధ ఆర్ట్స్, ఎన్.టి.ఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న దేవర సినిమా ఫస్ట్ గ్లింప్స్ తోనే సినిమా రేంజ్ ఏంటన్నది చూపించారు. ఆచార్య ఫ్లాప్ తో కొరటాల శివ కెరీర్ లో బ్యాడ్ ఫేస్ ఎదుర్కొన్నాడు. అయితే తారక్ తో చేసే కథతో మరోసారి తన పవర్ ఏంటన్నది చూపించాలని రెడీ అవుతున్నాడు. దేవర సినిమా ప్రతి యాస్పెక్ట్ లో ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారట. సినిమా రషెస్ తోనే బ్లాక్ బస్టర్ వైబ్ వస్తుందని తెలుస్తుంది. సెట్స్ మీద ఉన్న ఈ సినిమా బిజినెస్ విషయంలో కూడా అదరగొట్టేస్తుంది. ఆల్రెడీ సినిమా డిజిటల్ రైట్స్ 150 కోట్ల పైన డీల్ సెట్ అయినట్టు తెలుస్తుంది. థియేట్రికల్, ఆడియో రైట్స్ లో కూడా దేవర అదరగొట్టేస్తున్నాడని తెలుస్తుంది. అంతకుముందు ఏమో కానీ ట్రిపుల్ R తో పాన్ ఇండియా క్రేజ్ తెచ్చుకున్న ఎన్.టి.ఆర్ ఆ వెంటనే వస్తున్న సినిమాగా దేవర మీద విపరీతమైన బజ్ ఏర్పడింది. అందుకే సినిమా ప్రతి విషయంలో సర్ ప్రైజింగ్ ఎలిమెంట్స్ జరుగుతున్నాయి. ఆర్.ఆర్.ఆర్ లో చరణ్ తో కలిసి 1000 కోట్ల మార్క్ టచ్ చేసిన ఎన్.టి.ఆర్ ఈసారి సోలోగా ఆ మార్క్ రీచ్ అవ్వాలని చూస్తున్నాడు. ఎన్.టి.ఆర్, కొరటాల శివ ఇదివరకు జనతా గ్యారేజ్ సినిమా చేశారు. ఈసారి ఇద్దరు కలిసి దేవర గా రాబోతున్నారు. ముందు ఒక సినిమాగా అనుకున్న దేవర ఇప్పుడు రెండు భాగాలుగా చేస్తున్నారు. కచ్చితంగా దేవర సినిమా ఎన్.టి.ఆర్ ఫ్యాన్స్ అందరికీ ఫుల్ మీల్స్ పెడుతుందని అంటున్నారు. దేవర అనుకున్నట్టుగా 1000 కోట్లు కొడితే మాత్రం తెలుగులో నాన్ రాజమౌళి సినిమాతో తారక్ ఒక్కడే ఆ ఫీట్ సాధించిన వాడుగా రికార్డ్ సృష్టిస్తాడు. దేవర సినిమాలో ఎన్.టి.ఆర్ తో శ్రీదేవి తనయ జాన్వి కపూర్ జోడీ కడుతుంది.

ఈ సినిమాకు కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుద్ రవిచంద్రన్ మ్యూజిక్ కూడా మరో హైలెట్ గా నిలుస్తుందని అంటున్నారు. ఈ క్రేజీ కాంబోలో వస్తున్న దేవర బాక్సాఫీస్ దగ్గర మోత మోగించేయడం పక్కా అని ఫిక్స్ అయ్యారు తారక్ ఫ్యాన్స్.

## రిపబ్లిక్ డే.. ఎలాంటి సినిమాలు రాబోతున్నాయంటే




సంక్రాంతి ఫెస్టివల్ సీజన్ ఆల్ మోస్ట్ కంప్లీట్ అయిపోయింది. అయితే సంక్రాంతి రేసులో రిలీజ్ అయిన సినిమాలలో విన్నర్ గా హనుమాన్ మూవీ నిలిచింది. ఈ సినిమా రికార్డ్ కలెక్షన్స్ దిశగా దూసుకుపోతోంది. ఈ నెల ఆఖరు వారు హనుమాన్ సినిమా జోరు చూపించే అవకాశం ఉంది. అయితే జనవరి 25, 26 తేదీలలో కొన్ని ఇంటరెస్టింగ్ మూవీస్ రిలీజ్ అవుతోన్న నేపథ్యంలో స్పీడ్ తగ్గే ఛాన్స్ ఉంది. వాటిలో బాలీవుడ్ లో హృతిక్ రోషన్, దీపికా పదుకునే కాంబినేషన్ లో తెరకెక్కిన ఫైటర్ మూవీ జనవరి 25న హిందీతో పాటు ఇతర భాషలలో కూడా రిలీజ్ అవుతోంది. తెలుగులో కూడా డబ్బింగ్ వెర్షన్ రిలీజ్ అవ్వొచ్చు. అదే రోజు ధనుష్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కెప్టెన్ మిల్లర్ కూడా రిలీజ్ అవుతోంది. ఈ చిత్రానికి కోలీవుడ్ లో మంచి ఆదరణ లభించింది. సంక్రాంతి రేసులో ఉన్న తెలుగు రాష్ట్రాలలో థియేటర్స్ దొరకకపోవడం వలన జనవరి 25న తెలుగులో ప్రేక్షకుల ముందుకి వస్తోంది. అలాగే శివ కార్తికేయన్ అయలన్ మూవీ జనవరి 26న తెలుగు వెర్షన్ థియేటర్స్ లోకి వస్తోంది. ఈ సినిమా కూడా ఏలియన్స్ ఎలిమెంట్ తో కమర్షియల్, యాక్షన్ కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కి తమిళనాట మంచి వసూళ్లు రాబడుతోంది. తెలుగులో కూడా ప్రభావం చూపించే ఛాన్స్ ఉంది. అలాగే మలయాళీ మూవీమలైకొట్టై వాలీబన్ జనవరి 25న రిలీజ్ కాబోతోంది. హాన్సికా మోత్వానీ సింగిల్ పాత్రతో రాజ్ దుస్స దర్శకత్వంలో ప్రయోగాత్మక హర్రర్ థ్రిల్లర్ మూవీ 105 మినిట్స్ జనవరి 26న రిలీజ్ కాబోతోంది. ఈ మూవీ ట్రైలర్ కాస్తా ఇంటరెస్ట్ క్రియేట్ చేయడంతో ప్రేక్షకులకి ఎంత వరకు నచ్చుతుందనేది చూడాలి.

గత ఏడాది రిపబ్లిక్ డే టైంలో షారుఖ్ ఖాన్ పఠాన్ మూవీ రిలీజ్ అయ్యి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అలాగే వెయ్యి కోట్ల కలెక్షన్స్ కొల్లగొట్టింది. ఇప్పుడు ఆ ఛాన్స్ హృతిక్ రోషన్ ఫైటర్ కి వచ్చింది. ఈ మూవీ ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ఇంపాక్ట్ చూపిస్తుంది అనేది చూడాలి.

## డెనిమ్ బటన్ విప్పేసి.. టాప్ జిప్ తీసేసి.. కేతిక రచ్చ!

నేటితంలో అందం ప్రతిభతో ఆకట్టుకున్న అందాల కథానాయికలలో కేతికా శర్మ ఒకరు. ఈ భామ పరిచయం అవసరం లేదు. ఇటీవలే పవన్ - సాయిధరమ్ ప్రధాన పాత్రలు పోషించిన బ్రో చిత్రంలో అద్భుత నటనతో ఆకట్టుకుంది. తన చిత్రాలతో పాటు ఫ్యాషన్ ఎంపికలతోను ఇంటర్నెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తుంది ఈ ఉత్తరాది బ్యూటీ. కేతిక అద్భుతమైన ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్ తో సోషల్ మీడియాల్లో దూసుకుపోతోంది. తాజాగా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. కేతికా శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజా పోస్టలలో కేతిక రెబలియన్ టీజింగ్ లుక్ తో మతులు చెడగొట్టింది. డెనిమ్ ఫ్యాంట్ బటన్స్ పెట్టకుండా వదిలేసిన ఈ బ్యూటీ.. టైట్ బ్లాక్ టాప్ ధరించి జిప్ ని ఓపెన్ చేసింది. ఒక రకంగా కేతిక తన అభిమానులను ఈ కొత్త లుక్ తో టీజ్ చేస్తోందని చెప్పాలి. కేతికా శర్మ ఈ ఫోటోలను అప్‌లోడ్ చేసిన



వెంటనే ఈ బ్యూటీ సహజమైన రూపాన్ని చూసి అభిమానులు చాలా మంది ఆశ్చర్యపోతున్నారు. కేతిక అందాన్ని మెచ్చుకోవడానికి కొందరు వ్యాఖ్యల విభాగంలో చేరారు. ఆమెను రోజంతా చూడగలిగాను. నిజంగా చాలా అందంగా ఉంది అని ఒక అభిమాని వ్యాఖ్యానించగా, మరొక అభిమాని, చాలా అందమైన దేవదూత! అని రాశాడు. కేతిక అంతకుముందు మల్టీకలర్ బాడీ హగ్గింగ్ ట్యూబ్ డ్రెస్‌లో మేకప్ లెస్ లుక్ తో కనిపించింది. ఇప్పుడు అందుకు భిన్నమైన రూపంతో ఆకట్టుకుంది. కేతిక 2021లో రొమాంటిక్ చిత్రంతో తెరంగేట్రం చేసింది. ఈ చిత్రానికి అనిల్ పాదూరి దర్శకత్వం వహించారు. పూరి జగన్నాథ్ ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై ఛార్మి కౌర్‌తో కలిసి నిర్మించారు. ఈ చిత్రంలో ఆకాష్ పూరి, రమ్యకృష్ణ కూడా కీలక పాత్రల్లో నటించారు. పవన్ కళ్యాణ్ - సాయి ధరమ్ తేజ్ యొక్క బ్రో: ది అవతార్ లో కూడా కేతిక కీలక పాత్రలో కనిపించింది. కానీ ఇటీవల కెరీర్ పరంగా ఆశించినన్ని అవకాశాలు రాలేదు.

## అనన్య పాండే టోన్డ్ శిరులు

బాలీవుడ్ నటి అనన్య పాండే ఇటీవల తన తాజా చిత్రం ఖో గయే హమ్ కహాన్ విజయాన్ని అందుకుంది. ఇందులో అనన్య నటనకు మంచి పేరొచ్చింది. పాన్ ఇండియా మూవీ లైగర్ డిజాస్టర్ రిజల్ట్ తర్వాత బిగ్ రిలీఫ్ ఇది. తన సహనటులు ఆదర్శ్ గౌరవ్ , సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి అనన్య ఆనందకరమైన సక్సెస్ వేడుకలో పాల్గొన్నారు. ఈ చిత్రం వారి సినీ ప్రయాణంలో ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలిచింది. అనన్య పాండే ఈ సక్సెస్ పార్టీలో హెడ్ టర్నర్ గా మారింది. దీనికి కారణం బ్లాక్ ఫ్రాక్ లో యూనిక్ నెస్ తో కట్టి పడేయడమే. పార్టీలో కళ్లన్నీ అనన్యపైనే అంటే అతిశయోక్తి కాదు. అనన్య పాండే బ్లాక్ పిన్‌స్ట్రిప్డ్ కో-ఆర్డ్ సెట్ .. జిమ్మీ చూ హీల్స్‌లో చాలా స్పెషల్ గా ఉంది అంటూ కితాబు అందుకుంది.



ప్రస్తుతం ఈ అందమైన ఫోటోషూట్ యువతరంలో వైరల్ గా మారుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అనన్య పాండే చివరిసారిగా ఆయుష్మాన్ ఖురానాతో కలిసి డ్రీమ్ గర్ల్ 2లో కనిపించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించింది. తదుపరి ఖో గయే హమ్ కహాన్ మరో చక్కని విజయం అందించింది. అర్జున్ వరైన్ సింగ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో అనన్య అద్భుతంగా నటించిందని కితాబు దక్కింది. ఖో గయే హమ్ కహాన్‌తో కల్తీ లేని స్నేహం నేపథ్యంలో రూపొందించిన సినిమా. ఇది సోషల్ మీడియాల్లో పరిచయమైన 20 ఏళ్ల లోపు ఉన్న ముగ్గురు స్నేహితుల గురించిన కథాంశమిది. కమింగ్-ఆఫ్-డిజిటల్-యుగం కథ.




# అయోధ్య దర్శనం పేరిట ఫేక్ మెసేజ్‌లు..!

రీఛార్జ్‌లు, కంపెనీ స్పెషల్ ఆఫర్లు అంటూ అమయాక ప్రజలకు వల వేసే సైబర్ నేరగాళ్లు.. ఇప్పుడు మరో కొత్త అవతారం ఎత్తారు. అయోధ్యలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వేళ కొత్త మోసాలకు తెరతీస్తున్నారు. అయోధ్య దర్శనం, ప్రసాదం, ఫొటోలు అంటూ నకిలీ మెసేజులు పంపిస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా భక్తుల నమ్మకాలు, విశ్వాసాలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. రామ మందిరానికి డొనేషన్ల పేరిట క్యూఆర్ కోడ్‌లు పంపిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలను పట్టించుకోవద్దని, ధ్రువీకరించుకోకుండా ఎవరికీ సొమ్ములు పంపొద్దని సూచిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు 'అయోధ్య ప్రసాదం' అంటూ మరోతరహా మోసాలకూ పాల్పడుతున్నారు. అయోధ్య ప్రసాదం డెలివరీ పేరిట తమకు తోచిన నంబర్లకు సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపుతున్నారు. చిరునామా వివరాల పేరిట మోసపూరిత లింకులు క్లిక్ చేయించి ఫోన్లను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఫోన్ ఒకసారి వారి చేతిలోకి వెళితే కొన్ని క్షణాల్లోనే నగదు మాయం చేస్తున్నారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఫోన్ రీఛార్జి పేరిట ఇదే తరహా మోసాలు జరుగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయోధ్య కార్యక్రమం నేపథ్యంలో రాములోరి చిత్రాలు చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుండటంతో ఇంకొన్ని సైబర్ గ్యాంగులు శ్రీరాముడి లైఫ్ ఫొటోస్, అయోధ్య లైవ్ ఫొటోస్, అయోధ్య దర్శనం అంటూ సందేశాలు పంపిస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొవిడ్ సమయంలోనూ ఇలానే వ్యాక్సిన్ డోసులు, పీఎం కేర్స్‌కు విరాళాల పేరిట సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. ఇప్పుడు అయోధ్య సందర్భాన్నీ తమకు అనుకూలంగా మార్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియా, వాట్సాప్‌లలో వచ్చే సందేశాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.




# రీజినల్ రింగు రోడ్డుకు కదలిక

హైదరాబాద్: హైదరాబాద్ అవుటర్ రింగు రోడ్డు అవతల నుంచి నిర్మించాల్సిన ప్రాంతీయ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) దస్త్రాలకు కదలిక వచ్చింది. ప్రాంతీయ రింగు రోడ్డు విషయంలో ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించటంతో ఈ మార్గంపై మళ్లీ ఆశలు చిగురించాయి. మూడు క్లస్టర్లుగా పారిశ్రామిక అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించటంతో ఆర్ఆర్ఆర్ పట్టాలెక్కేందుకు మార్గం సుగమం అయింది. భూసేకరణ వ్యయాన్ని సమానంగా భరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించినప్పటికీ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ- జాతీయ రహదారుల సంస్థ- రాష్ట్ర రహదారులు, భవనాల శాఖల మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరగలేదు. తాజాగా ఆ ఒప్పందం విధి విధానాలను రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. రెండు భాగాలుగా 347.85 కిలోమీటర్ల మేర ప్రాంతీయ రింగు రోడ్డును నిర్మించాలని నిర్ణయించారు. సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగ్‌దేవ్‌పూర్, భువనగిరి, చౌటుప్పల్ వరకు 158.65 కిలోమీటర్ల ఉత్తర భాగానికి కేంద్రం ఇప్పటికే జాతీయ రహదారి హోదాను ప్రకటించింది. ఈ మార్గంలో భూసేకరణ సింహభాగం తుది దశలో ఉంది. ఒకట్రెండు ప్రాంతాలలో న్యాయస్థానం పరిధిలోకి వెళ్లింది. భువనగిరి ప్రాంతానికి చెందిన పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవటంతో రహదారి నిర్మాణానికి మంచి రోజులు రానున్నాయన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. న్యాయస్థానంలో ఉన్న కేసుల వివరాలను పంపాల్సిందిగా క్షేత్రస్థాయి అధికారులకు ఉన్నతాధికారులు సూచించారు.

**దక్షిణ భాగంలో...** చౌటుప్పల్, ఆమనగల్లు, షాద్‌నగర్, చేవెళ్ల, సంగారెడ్డిల మీదుగా 189.20 కిలోమీటర్ల మేరకు దక్షిణ భాగం రహదారి నిర్మాణానికి సవివర నివేదిక(డీపీఆర్)కు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూత్రప్రాయ ఆమోదాన్ని తెలిపాయి.

ఈ మార్గానికి జాతీయ రహదారి హోదా లభించాల్సి ఉంది. ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతున్నాయి.

**రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పెరిగిన ప్రాధాన్యం :** లోక్‌సభ ఎన్నికలు ముగిసే దాకా ఈ మార్గం విషయంలో పెద్దగా కదలిక ఉండదని అధికారులు సైతం భావించారు. పారిశ్రామిక క్లస్టర్లకు ప్రాంతీయ రింగు రోడ్డునే కేంద్ర బిందువుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటంతో మళ్లీ చర్చల్లోకి వచ్చింది. అధికారులు మునుపటి ప్రతిపాదనలను తరచి చూస్తున్నారు. భూ సేకరణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించేందుకు నిర్ణయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా నిధులు విడుదల చేసేందుకు సుముఖత చూపింది. అయినా బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కూడా పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. ఈ విషయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నలుగుతోంది. అలాగే రహదారి నిర్మించాల్సిన మార్గాల్లో ఉన్న విద్యుత్తు, వివిధ రకాల కేబుల్స్, తాగునీటి పైపులైన్లు తదితరమైనవాటిని మార్చేందుకు అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కేంద్రం లేఖ రాయటంతో మరింత పీటముడి పడింది. దీనికి ఎంత వ్యయం అవుతుందన్నది జాతీయ రహదారుల సంస్థ గతంలో అంచనాలు రూపొందించింది. పెరిగిన ధరల నేపథ్యంలో తాజాగా వాటిని సవరించాలని నిర్ణయించింది.

# లండన్‌లో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

## బీఆర్ఎస్ బొందపెడతానంటూ వ్యాఖ్య

### పులి బయటికి వస్తే బోనులో వేసి చెట్టుకు వేలాడదీస్తాం.. కేటీఆర్‌పై రేవంత్ సంచలన వ్యాఖ్యలు..



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి గట్టి కౌంటర్ ఇచ్చారు. పులి బయటికొస్తుందని ఇటీవల వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. పులి బయటికి వస్తే బోనులో వేసి చెట్టుకు వేళాడదీస్తామని రేవంత్ వ్యాఖ్యలు చేశారు. అయితే తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం పలు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ తర్వాత అక్కడ ఉన్న తెలంగాణ వ్యక్తులు, కాంగ్రెస్ అభిమానులతో రేవంత్ భేటీ అయ్యారు.

ఆ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ చుద్దామన్నా కూడా కనిపించదని వ్యాఖ్యానించారు. అంతేకాదు వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గుర్తే ఉండదని రేవంత్ అన్నారు. కేసీఆర్‌ను పులితో పోల్చిన కేటీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో రేవంత్ రెడ్డి లండన్ వేదికగా స్పందించారు. ఒక్క ఎన్నిక విషయంలోనే బీఆర్ఎస్ నేతలు బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలకు మాత్రం ఆహంకారం తగ్గలేదన్నారు. వారి గర్వం, అహంకారం తగ్గించే బాధ్యత తనదేనని రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలైన తర్వాత వారికి భయం పట్టుకుని ఇలా మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు.

# జనవరి కరెంట్ బిల్లులు కట్టకండి: తెలంగాణ ప్రజలకు కేటీఆర్ పిలుపు




హైదరాబాద్ : బీఆర్ఎస్‌ను బొందపెట్టి తీరతానంటూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ పడింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ లాంటోళ్లను చాలామందిని చూశామని వ్యాఖ్యానించిన ఆయన.. ఈ క్రమంలో తీవ్రస్థాయిలోనే విమర్శలు గుప్పించారు. అలాగే జనవరి నెల కరెంట్ బిల్లులు ఎవరూ కట్టవద్దంటూ తెలంగాణ ప్రజలకు కేటీఆర్ పిలుపు ఇచ్చారు. బీఆర్ఎస్‌ను వంద మీటర్ల లోతున బొందపెట్టే సంగతి తర్వాత చూసుకుందాం. ముందు 100 రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయండి అని కేటీఆర్ సీఎం రేవంత్‌కు చురకలు అంటించారు. అహంకారంతో మాట్లాడిన రవేంత్‌రెడ్డి లాంటి నాయకుల్ని బీఆర్ఎస్ తన ప్రస్థానంలో ఎంతో మందిని చూసిందని.. రెండున్నర దశాబ్దాలు నిలబడి రేవంత్ లాంటోళ్లను మట్టి కరిపించిందని అన్నారాయన. "తెలంగాణ జెండాను ఎందుకు బొంద పెడుతావ్? తెలంగాణ తెచ్చినందుకా?.. తెలంగాణను అభివృద్ధి చేసినందుకా? లేకుంటే మిమ్మల్ని.. మీ దొంగ హామీల్ని ప్రశ్నిస్తునందుకా?" కేటీఆర్ నిలదీశారు. బీజేపీతో బీఆర్ఎస్ కు ఏరోజు పొత్తు లేదని.. భవిష్యత్తులోనూ ఉండబోదని శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీ ఆర్ ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ పునరుద్ఘాటించారు. "రేవంత్ రక్తం అంతా బీజేపీదే. అందుకే ఇక్కడ చోటా మోదీగా రేవంత్ రెడ్డి మారిండు. డబుల్ ఇంజన్ అంటే అదానీ, ప్రధాని అన్న రేవంత్ ఇప్పుడు ట్రిపుల్ ఇంజన్ గా మారిండు. రేవంత్ కాంగ్రెస్ ఏక్‌నాథ్ షిండేగా మారతాడు" అంటూ కేటీఆర్ పంచ్‌లు వేశారు.

**కరెంట్ బిల్లుల్ని సోనియాకు పంపించండి :** అలాగే.. ఈ జనవరి నెల కరెంట్ బిల్లులు ఎవరూ కట్టవద్దని.. ఆ బిల్లులను ఢిల్లీలోని కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ ఇంటికి పంపించాలంటూ తెలంగాణ ప్రజలకు పిలుపు ఇచ్చారాయన. "ఈ జనవరి నెల కరెంటు బిల్లులు ప్రజలు ఎవరూ కట్టొద్దు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత విద్యుత్తు పథకం గృహజ్యోతి హామీని నెరవేర్చే దాకా బిల్లులు కట్టొద్దు. స్వయంగా ముఖ్యమంత్రి.. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లుగానే ఉచిత విద్యుత్ కోసం డిమాండ్ చేయాలి. కరెంటు బిల్లులు అడిగితే అధికారులకు ముఖ్యమంత్రి మాటలను చూపించాలి. సోనియా గాంధీ బిల్లు కడుతుందని ముఖ్యమంత్రి ఎన్నికలప్పుడు చెప్పిండు. అందుకే కరెంటు బిల్లు ప్రతులను సోనియా గాంధీ ఇంటికి, 10జన్ పత్ కు పంపించాలి" అని కేటీఆర్ అన్నారు. అలాగే.. హైదరాబాద్‌లో ఉన్న ప్రతి ఒక్క మీటర్ కి గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్తు అందించాలని.. గృహ జ్యోతి కార్యక్రమాన్ని వెంటనే అమలు చేయాలి.. ఇందులో కిరాయి ఇండ్లలో ఉండే వాళ్ళకి కూడా ఉచిత విద్యుత్తు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ వ్యాఖ్యలపై భారాస నేతల ఆగ్రహం



హైదరాబాద్: వచ్చిన అవకాశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వినియోగించుకుని ప్రజలకు మంచి చేసి పేరు తెచ్చుకోవాలని భారాస నేతలు అన్నారు. లండన్‌లో సీఎం చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లి పెట్టుబడులు తీసుకురావాలి కానీ అంత అహంకారం పనికిరాదని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నిరంజన్ రెడ్డి అన్నారు. విదేశీ పర్యటనలో ఆయన అసంబద్ధంగా మాట్లాడి రాష్ట్రం పరువు తీశారని ఆక్షేపించారు. సీఎం పాండిత్యాన్ని రాష్ట్ర ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ అధికారం ఉందనే అహంకారంతో 100 మీటర్ల లోతులో భారాసను తొక్కిపెడతానని చెప్పడం సబబు కాదన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని చెప్పారు.

అధికారం ఉన్నా లేకపోయినా తాము ఒకేలా ఉన్నామన్నారు. పెట్టుబడులు వచ్చేలా కృషి చేయాలే తప్ప.. రాష్ట్ర పరువు బజారుకీడిస్తే ఎలా? అని దానం ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఎన్ని సీట్లు గెలుస్తారో చూద్దామని ఆయన సవాల్ విసిరారు.

# 500 నోటుపై రాముడి ఫొటో ముద్రించండి: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్



మహారాష్ట్ర శంభాజీ పూర్: అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ ఈ నెల 22వ తేదీన జరగనుంది. ఈ క్రమంలో గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ.500 నోటుపై రాముడి ఫొటోను ముద్రించాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, యూరప్‌లోని కొన్ని దేశాలు కరెన్సీపై హిందు దేవతల ఫొటోలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇండోనేషియాలో 80 శాతం ముస్లింలు ఉన్నారని రాజా సింగ్ వివరించారు. మన దేశంలో రూ.500 నోటుపై రాముడి ప్రతిరూపం ముద్రించాల్సిన అవసరం ఉందన్నారు. రూ.500 నోటుపై శ్రీరాముడి ఫొటో ముద్రించాలని తన ఒక్కడి డిమాండ్ కాదని, 100 కోట్ల మంది హిందువుల అభిప్రాయమని తెలిపారు. మహారాష్ట్ర శంభాజీపూర్‌లో రాజా సింగ్ మీడియాతో మాట్లాడారు. దేశంలో వక్ఫ్ బోర్డు పేరుతో ఉన్న భూములను విడుదల చేయాలని ఎమ్మెల్యే రాజా సింగ్ కోరారు. దేశ విభజన సమయంలో ఇక్కడి జనాలను హతమార్చిన వారి ఆస్తులను కాపాడేందుకు నెహ్రూ ప్రభుత్వం వక్ఫ్ చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. మహారాష్ట్రలో 10 లక్షల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డు పేరుతో ఉందని వివరించారు. 2009 వరకు 4 లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉండేదని గుర్తుచేశారు. అది క్రమంగా 10 లక్షల ఎకరాల వరకు విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ భూములను మహారాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రాజా సింగ్ కోరారు. లేదంటే కోర్టులో పిటిషన్ వేస్తామని హెచ్చరించారు.



# కఠిక నేలపై నిద్ర, యోగ.. అయోధ్య ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ దినచర్య ఇదే

ఢిల్లీ: అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ అనుస్థాన్(ప్రత్యేక జపం) పాటిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన జనవరి 12 నుంచి కఠిక నేలపై నిద్ర పోతున్నారు. ఉదయం లేవగానే యోగా, వ్యాయామం, ధ్యానం చేస్తూ గడుపుతున్నారు. 11 రోజులపాటు అనుస్థాన్ నియమాలను తప్పనిసరిగా పాటించనున్నట్లు ఆయన తెలిపారు. "అయోధ్య బాలరాముడి ప్రారంభోత్సవం శుభపరిణామం. ఆరోజు చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవబోతోంది. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నా సమక్షంలో జరగడం.. కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలు నెరవేర్చడానికి భగవంతుడు నన్ను పుట్టించినట్లుగా భావిస్తున్నాను. అందుకే అనుస్థాన్ పాటిస్తున్నాను. ఈ ఘట్టం నన్ను ఎంతో భావోద్వేగానికి గురి చేస్తోంది. నా జీవితంలో తొలిసారి ఇలాంటి అనుభూతిపొందుతున్నాను. అయోధ్య ప్రారంభోత్సవం ప్రపంచమంతటికీ పవిత్రమైన సందర్భం" అని మోదీ అన్నారు.

**ప్రాణ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి..** జనవరి 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఏర్పాట్లు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు దేశ నలుమూలల నుంచి ప్రముఖులు, భక్తులు తరలిరానున్నారు.

ఆలయాన్ని నిర్మించిన కార్మికుల కుటుంబాలకు కూడా ఆహ్వానాలు వెళ్లాయి. ఆహ్వానాలు వెళ్లిన వారిలో 7 వేలకు పైగా ప్రముఖులు ఉన్నారు. బుధవారం రాత్రి అయోధ్య రాములోరి గుడిలోకి రామ్ లల్లా విగ్రహాన్ని తీసుకొచ్చినట్లు శ్రీ రామ మందిర నిర్మాణ కమిటీ ఛైర్ పర్సన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. రాముడ్ని ప్రతిష్ఠించేచోట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

# ప్రజాభవన్‌లో టాయిలెట్ల రిపేర్లకు అంత ఖర్చా?



హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రగతి భవన్ కాస్త ప్రజా భవన్‌గా మారింది. ప్రజా సందర్శనకు అనుమతి ఇస్తూ.. వాటి ముందు ఉన్న బారికేడ్లను సైతం తొలగించారు. ఆపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ప్రజా భవన్‌ను కేటాయించారు. అయితే కేసీఆర్ హయాంలో దుబార జరిగిందని.. కాబట్టి హంగులు ఆర్భాటాలకు పోకుండా ఉంటామని ప్రకటించుకుంది రేవంత్ సర్కార్. కానీ, ప్రజా భవన్ రిపేర్ల కోసం చేస్తున్న ఖర్చుపై ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తోంది. ప్రజా భవన్‌లో టాయిలెట్ల రిపేర్లు కోసం.. అలాగే దోమ తెరల కోసం రూ.35 లక్షలకు టెండర్లను కాంగ్రెస్ ప్రభుత్వం పిలిచినట్లు తెలుస్తోంది. మరో టెండర్‌లో భాగంగా జిమ్ రూంలో పొడుగు అద్దాలు, గన్‌మెన్ రూముల కోసం రూ.28.70 లక్షలకు టెండర్లను ప్రభుత్వం ఆహ్వానించినట్లు సమాచారం.

# అయోధ్యకు పాక్ 'జైషే' ఉగ్ర ముఠా బెదిరింపులు

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు ముహూర్తం సమీపిస్తున్న వేళ.. వరుసగా బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. నిన్నటికి నిన్న అయోధ్యలో విధ్వంసం సృష్టిస్తామని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హెచ్చరించాడు. తాజాగా పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రముఠా జైషే మహ్మద్ బెదిరింపులకు పాల్పడింది. బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనలను ప్రస్తావిస్తూ.. కల్లోల పరిస్థితులు ఉంటాయని హెచ్చరించింది. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. అయోధ్యలో హైఅలర్ట్ ప్రకటించారు. ప్రస్తుతానికి పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, భద్రతా పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని నిఘా వర్గాలు వెల్లడించాయి. అటు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉగ్రదాడులు జరిగే ముప్పు ఉండటంతో.. ఇప్పటికే దేశవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది జనవరిలోనూ జైషే ఇలాంటి బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. రామమందిర ప్రారంభోత్సవం నేపథ్యంలో అయోధ్యలో భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్).. ఇటీవల ముగ్గురు ఖలిస్థానీ సానుభూతిపరులను అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలోనే పన్నూ శుక్రవారం హెచ్చరికలు పంపాడు. రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో విధ్వంసం సృష్టిస్తామని, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను హత్య చేస్తానని బెదిరించాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com